PRAMUKHANDHRA 27th Year of Publication We carry the news and views of Telugus

27 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర




వ్యవస్థాపకులు

శ్రీ గోటేటి శ్రీరామారావు

₹.15

డిసెంబర్ 2021

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA





# నరేంద్ర మోడీ జయహో

**13 డిసెంబర్ 2021** సోమవారం – భారతదేశ చరిత్రలో గుర్తుంచుకోవలసిన రోజు.

భారత దేశం వేద భూమి , కర్మ భూమి , పుణ్యభూమి అని చదువుతూ వుంటాం , పురాణ కాలక్షేపాలలో వింటూ వుంటాం కాని అవెంతవరకూ మనసుకు తీసుకుంటాం అనేది ప్రశ్నార్థకమే , హిందువులలో అనైక్యత ఎక్కువ , వీరందరిని ఒక్క త్రాటిపైకి తీసుకురావడమనేది సాధారణ విషయం కాదు .

మన పురాతన దేవాలలయిన కాశీ , మథుర , అయోధ్య దేవాలయాలన్నీ మొగలాయిలచే కూల్చి వేయబడ్డాయన్నది జగమెరిగిన సత్యం , చరిత్ర కూడా.

వెయ్యేళ్ళుగా కోట్లాది హిందువుల హృదయాలను మెలిపెడుతున్న బాధకు కారణమైన కాశీ విశ్వనాథాలయ దీనావస్థ మనందరికి తెలిసిందే..

నా దృష్టిలో నరేంద్రమోడీగారిని ఆదిశంకరులు, వివేకానందస్వామి వంటి వారి వరుసలో ఉంచాలి. ఈ భారతదేశం , భారతజాతి ఆయనకంతగా ఋణపడి పోయింది.

'దివ్యకాశీ భవ్యకాశీ' అంటూ శ్రీ నరేంద్రమోడీగారు రెండేళ్ల క్రితం తలపెట్టిన ప్రాజెక్ట్ మొదటి దశ పూర్తయింది. అంతకు ముందే సంకల్పించిన గంగా ప్రక్షాళన ప్రాజెక్ట్ కూడా పూర్తయింది. నేడు కాశీలో జరిగిన అద్భుతమైన కార్యక్రమంలో కాశీ విశ్వనాథ్ కారిడార్ ను మోడీగారు జాతికి అంకితం చేశారు. పునీత గంగామాత శుభ్రపడింది. సరాసరి నదినుండి విశ్వనాథాలయానికి వెళ్లే దారి సుగమమైంది. కోట్లాది హిందువుల బాధ మాయమైంది. దేశం పులకరించింది.

ఈ సందర్భంలో ఆయనిచ్చిన ఉపన్యాసాన్ని మొదటినుండీ చివరివరకూ వినమని అందరినీ నేను కోరుతున్నాను. అలాంటి అద్భుతమైన ప్రసంగాన్ని మనము కొన్నిసార్లు మాత్రమే వింటాము. ఆ ఉపన్యాసం వింటే, మోడీగారిలోని దేశభక్తుడు మాత్రమే గాక, ఒక గొప్ప ఉన్నతమైన స్థితిని అందుకున్న కర్మయోగి మనకు దర్శనమిస్తాడు. వినేవారి ఒళ్ళు పులకరించి, కళ్ళు చెమర్చే అద్భుతమైన ఉపన్యాసమది.

ఈనాటికి, ప్రధానమంత్రి నరేంద్రమోడీగారి పుణ్యమా అని, కాశీ విశ్వనాథాలయం తన పూర్వ వైభవాన్ని పొందింది. వెయ్యేళ్ళ హిందువుల తపస్సు ఈ రోజున ఫలించింది. అంతే కాదు. కాశీ సందుగొందులను వెడల్పు చేసే పనిలో, దాదాపు **1500** మంది కుటుంబాలకు వేరే చోట స్థలాలిచ్చి తరలించారు. ఆ ఇళ్ల మధ్యలో, చరిత్ర ప్రసిద్ధి గాంచిన **40** ఆలయాలు బయటపడ్డాయి. మన పురాణాలలో వీటి ప్రస్తావనలున్నాయి. కానీ, కాశీలో ఇవి ఎక్కడా కనిపించడం లేదు. ఏమంటే, ఆక్రమణలకు గురై ఇళ్లలో ఇళ్ళుగా మారిపోయాయి. ఇపుడా **40** ఆలయాలు మళ్ళీ తమ పూర్వవైభవాన్ని సంతరించుకున్నాయి. ఈ కారిడార్ లో పని చేసిన కార్మికులకు పువ్వులు జల్లి వారితో కూర్చుని భోజనం చేశారు దేశ ప్రధాని మోడి , ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్.

ఎంతటి పుణ్యాత్ముడో మోడీగారు? ఇటువంటి కారణజన్ములు ప్రతితరంలోనూ పుట్టనుగాక పుట్టరు.

స్వాతంత్రం వచ్చిన **75** ఏళ్లకు కూడా మన దేవాలయాలను మనం స్వాధీనం చేసుకోలేకపోవడానికి, ధ్వంసం చేయబడిన ఆలయాలను మళ్ళీ కట్టుకోలేకపోవడానికి, మతప్రాతిపదికన దేశాన్ని విడగొట్టికూడా, మన దేవాలయాలను స్వాధీనం చేసుకోకుండా వాటినలాగే వదిలేసిన సోకాల్డ్ నాయకులే కారకులు. ఈ మహాపాపం వారిదే.

మనమే కాదు, రాబోయే వేలాది తరాల భారతీయులందరూ నరేంద్రమోడీ గారిని గుర్తుంచుకోవాలి . ఖచ్చితంగా ఆయన కారణజన్ముడే కాదు, భరతమాత ముద్దుబిడ్డా, మన హిందూధర్మాన్ని మళ్ళీ నిలబెట్టిన యుగపురుషుడు!

భారతదేశం ఆయనకు శాశ్వతంగా ఋణపడిపోయింది ! ఇంకొన్నేళ్ళు ఆయనే మన ప్రధానమంత్రిగా ఉండాలి!




# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

డిసెంబర్ 2021

సంపుటి : 27 **324** సంచిక : 12




# సంస్కృతీ సాంప్రదాయ పరమైన దిగుమతి విధానమే దేశ భవిష్యత్తును దిగజారుస్తున్నది!

**ఈ**నాడు భారతదేశంలో ఎక్కడ చూచిననూ, పాశ్చాత్య సంస్కృతి, పాశ్చాత్య సాంప్రదాయ ప్రభావం జనజీవన స్రవంతిలో విశేషంగా కనిపిస్తున్నది. కట్టుబొట్టులను కలిసికట్టుగా మరచిపోయిన భరతజాతి, కలిసికట్టు జీవన విధానాన్ని కూడా పూర్తిగా మరిచిపోయింది.

ఇతర దేశాల నుంచీ విధ్వంసనా సంస్కృతిని అరువు తెచ్చుకున్నది. ఎక్కడ జూచిననూ బాంబుల పేలుళ్లూ, మారణ హోమాలూ, మానభంగాలూ, మాత్సర్య ధోరణులే కనిపిస్తున్నాయ్. స్వయంపాలనా రాష్ట్ర ప్రజాస్వామ్య ప్రభుత్వాలు యేర్పడినపుడు, ఆయా రాష్ట్రాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల వనరుల అభివృద్ధికి కృషిని చేపట్టకుండా, అధికార పక్ష ప్రతిపక్ష వర్గాలు రోజురోజుకూ కార్పణ్య ద్వేషాలతో రాజుకుంటూ, పాలననూ, దేశ అభివృద్ధిని స్తంభింపచేయడం ఈమధ్య కాలంలో ఎక్కువైపోయింది. ఇటు అసెంబ్లీ సమావేశాలు జరగవు, అటు పార్లమెంటు, రాజ్యసభలు జరుగవు. తన్మూలకంగా పాలనా సంస్కరణలు జరుగవు, ప్రజలకు ప్రగతి వుండదు, పరిశ్రమల్లో ఉత్పత్తులు జరుగవు. 'సెక్యులరిజమ్' అనే ముసుగులో రాజకీయ వర్గాలు పరస్పర మైత్రీవిధానమును అనుసరించే మార్గాన్ని అన్వేషించకుండా, ద్వేషాగ్నిలో కాలయాపన జరుపడం వింతగా (కలిమాయ)గా తోస్తున్నది. సనాతనధర్మంలో మతాలు లేవనీ, మనకు మనంగా మన అభిమతాలకు అనువుగా కల్పించుకున్నవే మతాలని 'ప్రముఖాంధ్ర' పలుమారులు ప్రవచించింది. మతాలూ, కులాలూ, వర్గాలూ యనీ చెప్పేనాధులూ, వినే వివేకవంతులూ తక్కువయ్యారు. రోజు రోజుకూ పెరిగే రిజర్వేషన్ల శాతంలో కులాల మధ్య చిచ్చును పెట్టి, కాలుష్య జ్వాలలను రగులుగొల్పుతున్నారు. మనం అరువుతెచ్చుకుంటున్న సంస్కృతీ, సాంప్రదాయములే ఇందుకు కారణభూతమవుతున్నాయ్. అనాదిగా మన దేశానికి వేదముల మూలముగా సంప్రాప్తించిన శాస్త్రముగానీ, సంస్కృతిగానీ, సాంప్రదాయమును గానీ, మనం నిక్షిప్తపరచుకోలేదు, పరదేశాలవి గ్రహించి లబ్ధి పొందాయ్. మన వేదాలాధారంగా వారు సాధించిన విజ్ఞాన సారాన్ని మనం, వాళ్ల ప్రతిభలతో కూడిన ముద్రతో అరువు తెచ్చుకుంటున్నాం. ఇన్ని విధాలుగా మనం మన దేశ విధానంలో భ్రష్టు పడుతున్నప్పటికినీ, కొంతగా కొంతయైనా మత సంపదను మనం అధ్యయనం చేస్తూ, నిక్షిప్తం చేసుకుంటున్నామంటే మూలపురుషులైన మన గురువులే! వారినే ధర్మ పునరుద్ధరణం కావించమని ప్రార్థిద్దాం.



బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*

(మే 2000)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# తల్లిదండ్రులు సుశిక్షితులైన వారయినప్పడే జనత భాషలో, భావనలో జాతీయత ఉట్టిపడుతుంది!

రక్తంలో, శరీర ఛాయల్లో తెలుగుదనం, భారతీయత ఉన్నంతమాత్రాన ప్రయోజనం లేదు. అభిరుచుల్లో, భావనైసర్గికంలో, నైతిక విలువల్లో జాతీయత, సమైక్యత ఉట్టిపడాలి. అది ప్రాథమికంగా తల్లిదంద్రులనుంచీ, అటుపిమ్మట ప్రాథమిక, మాధ్యమిక ఉన్నత పాఠశాలలనుంచీ, కళాశాలలనుంచీ పుట్టుకుని వస్తుంది!

శ్రమరహితంగా బ్రతకాలనే భావన యువతలో బయలుదేరింది. దేశం పట్ల ప్రేమ లేకపోవడం, జాతీయ భావన లేకపోవడం భారత ప్రజాస్వామ్యంలో ప్రవేశించిన దురదృష్టకర సంఘటనలు, ముఖ్యంగా యువతలో వేళ్లూనుకున్నాయ్! అవిద్య, అసూయ, అబుద్ధీ, అవివేకం, అహంకారం అను పంచ దుర్గుణాలు, ప్రజల్లోనూ, పాలకుల్లోనూ, బాధ్యతగల ఉద్యోగస్తుల్లోనూ అంటు జాడ్యంగా పరిణమించాయ్. తెల్లవాళ్లకున్న తెలివి, సూక్ష్మబుద్ధీ మనకు లేవు.

1836 సం॥ములో బాబింగ్టన్ మెకాల్ అనే తెల్లదొర మనదేశంలో ఇంగ్లీషు భాషాభ్యాసం, పాశ్చాత్య నాగరికతను ప్రవేశపెట్టడం కోసం ఎంతగా శ్రమించాడో చరిత్రపేజీలను తిరగవేస్తే తెలుస్తుంది. అతడపుడు కలకత్తాలో ఉంటూ హుగ్లీ పట్టణంలో 1400 మంది ఒకేసారి ఆంగ్లం నేర్చుకొనే ఏర్పాటుచేశాడు. ప్రభుత్వ ఖజానాలో నున్న ధనాన్నంతటినీ ఆంగ్లభాషను నేర్చుకోవడానికే ఖర్చుపెట్టించాడు. ఉపకార వేతనాల నేర్పాటుచేశాడు. ప్రైవేటుగా పాఠశాలలు నెలకొల్పేవారికి గ్రాంటులనేర్పాటు చేశాడు.

స్వదేశీ భావనను ప్రజల్లో కల్గించడం కోసం రాజమండ్రిలో గాడిచెర్ల హరి సర్వోత్తమరావుగారు గోదావరి తీరానగల కోటిలింగాలవద్ద సభనేర్పాటుచేసి విదేశీభావ విసర్జన, స్వదేశీ భావ ఉద్ధరణ కోసం అఖండంగా ప్రసంగించారు. శ్రీయుతులు గంటి లక్ష్మన్న, టంగుటూరి శ్రీరాములు, కంచుమర్తి రామచంద్రరావు, చిలుకూరి వీరభద్రరావు వంటి ఉద్దండులు 'బాలభారతి సమితి'ని ప్రారంభించారు. మహాకవి చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు బ్రిటిష్వారు మన దేశానికి కల్గిస్తున్న చేటును కలంపట్టి ఈ క్రింది చాటు పద్యాల ద్వారా చాటిచెప్పారు.

**1. భరతఖండంబు చక్కని పాడియావు.**
**హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ**
**తెల్లవారనుగడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి**

**2. దుడుకుతనమున తీరదీ గడుసుతనము**
**కానతాపులు పోటులు కార్యమునక**
**లేగలన్నీ నేత మౌలాగొనర్చి**
**నేర్పుతో తల్లికెగ జేప నేర్పవలయు –**

అని గోడలపై, నాలుగు రోడ్ల కూడలిపై ప్రజలు వ్రాయడం, బిపిన్ చంద్ర పాల్ వంటి నేతలు రావడం, చిలుకూరి వీరభద్రరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కౌతా శ్రీరామశాస్త్రి లాంటి వారు స్ఫూర్తి కల్పించడంతో జాతీయతకు భిన్నం కలుగకపోయినప్పటికినీ, విద్యావిధానంలో కలిగిన కాలుష్యం పోలేదు సరికదా, స్వరాజ్యం వచ్చిన తరువాత మరింత రణం (కురుపులా ఎదిగింది. దేశభక్తిని పెంచుకోకపోగా, స్వార్ధ సంకుచితత్వాలను జనం పెంచుకుంటూ పోతున్నారు. దేశంలోని రాజకీయనాయకులు సెక్యులరిజమ్ పేరుతో స్వకుచమర్దనం చేస్తూ, తమ వారి కళ్లను తామే పొడుస్తున్నారు. సనాతన ధర్మపునరుద్ధరణం జరిగితేగానీ, భారతదేశం పురోభివృద్ధిని నోచుకోదు. ఇందుకు నాయకులతో బాటు ప్రజలు కూడా పూనుకోవాలి. మహాకవి గురజాడ అప్పారావు ప్రవచించినట్టు దేశమనెడి దొడ్డ వృక్షం ప్రేమయనెడి పూలను పుష్పింపచేయాలి. దేశం అంటే మట్టికాదు మనుష్యులనెడి భావన నాయకమణ్యుల్లో కలగాలి. అనంత విశ్వాన్ని పక్షపాతరహితంగా తన వెలుగులతో ప్రకాశింపచేస్తున్న సూర్యునిలా ఒక్కడు ఉన్నప్పటికినీ ప్రగతిపథంలో నడవగలం. భూమీ, నీరూ, గాలుల్ని పంచుకొనే రాక్షస విధానానికి స్వస్తి చెప్పాలి. అప్పుడే భారతదేశం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తుంది. ఆ శుభదినం రావాలని అందరూ ఎదురుచూద్దాం. **– గోటేటి**

# తల్లి తండ్రులకు చేసిన సేవ దైవ సేవ కన్నా మిన్న!

అన్నదెవరో కాదు మహావిష్ణువు

అన్నది ఎవరితోనో కాదు సాక్షాత్తూ బ్రహ్మమానస పుత్రుడు నారదునితో –

ధర్మవ్యాధోపాఖ్యానంలో ఈ విషయం వస్తుంది. ఒకనాడొక వృద్ధ బ్రాహ్మణ రూపంలో ఓ మహానుభావుడు వచ్చి– ధర్మ వ్యాధున్ని ప్రశ్నిస్తూ ఎంతసేపు నీ ఆతిథ్యంకోసం ఎదురు చూడాలయ్యా అంటూ ప్రశ్నిస్తాడు.

చూడడానికి ధర్మవ్యాధుడు ఓ చిన్న మాంసం వ్యాపారం చేసేవాడు – అంచె లంచెలుగా అతడు ఎదుగుతున్నాడు. అతని తల్లితండ్రులు స్వయంగా ఆహారం తీసుకోలేని వృద్ధులు) వారు. నిత్యమూ ముప్పేళలా వారికి ఉపచర్యలు చేసి, ఉపాహార, పూర్ణాహారములు తినిపిస్తే గానీ, మరేపనీ చేసేవాడు కాడు. సద్ పరమాత్ముడొచ్చినా, పరమ గురుడు వచ్చినా అంతే– తల్లి తండ్రీ తరువాతనే దైవం, గురువు. ఓ రోజు కౌశికుడనే బ్రాహ్మణునితో ప్రస్తావిస్తూ–

**ఉపాహార నాహారంతో... దేవతానాం యధాద్విజా**
**కుర్వతే తద్వ దేతాభ్యాం కరోమ్మహ మతంద్రితః**

అన్నాడు. అయ్యా నాకూ దైవభక్తి, గురుభక్తి ఉన్నది. అయితే దేవతలు, ద్విజుల్ని పండ్లు ఫలములనిస్తూ యెలా సేవిస్తారో, అలా నేనూ ఏమరపాటు లేకుండా క్రమం తప్పకుండా తొలిగా నా తల్లి తండ్రులనే సేవిస్తాను అంటాడు. వాడయ్యా నా భక్తుడు. ఇలా సదాచార సరళిగా ఓ మహిత సూక్తిని కూడా ఇందు భగవంతునికి వివరిస్తున్నాను.

**వృద్ధజన సేవచేసిన**
**బుద్ధి విశేషజ్ఞుడగుచు పూతచరితుడన్**
**సద్ధర్మ శాలియన బుధ**
**విద్ధరంబొగెడెదరు ప్రేమ యనంగా కుమారా–**

అని శతకకర్త చెప్పాడు.

తన తల్లితండ్రులవంటి వృద్ధజన సేవ చేసేవారిని– బుద్ధి విశేషుడనీ, మంచి నడవడిక కలవాడనీ, ధర్మంతో అలరారే గొప్ప జ్ఞాన సంపద గలవాడనీ, పండితులూ, పరమాత్ముడూ కీర్తిస్తారయా కుమారా! అన్నాడు.

పురుషుడు పురుషోత్తముడనదగు యోగ్యతనే శతకకర్త యెలా తెలియ జేశాడో చదవండి.

**సదోష్ఠి సరియు నొసగున్**
**సదోష్ఠియె కీర్తిబెంచు, సంతుష్టిని**
**సద్గోష్ఠియె పాపములను జంపు కుమారా!**

– నీతిబోధ చేస్తే ఎంతటి పరమార్ధముందో, పరమార్ధ జ్ఞానం ఉందో గ్రహించారా – మంచి వారి గోష్ఠిలో ఉంది, మంచి వారెపుడూ మంచి వారిని గూర్చే మాట్లాడుతారు, నీకందు ఎన్నో మంచి కారణంగా కీర్తిని పొందుతావో తెలియక, తెలిసీ చేసిన పాపాలుంటే పటాపంచలవుతాయ్ అన్నాడు. శతకకర్త ఎన్ని శతాబ్దముల క్రితం వాడో –

తెలుగు సాహిత్యాన్ని కున్న ఔన్నత్యమే పద్యం. ఆ పద్య ఔన్నత్వాన్ని ప్రస్ఫుటింప చేసేదే, భక్తీ శక్తీ, వివేకం, విజ్ఞతా లక్షణం. తెలుగు భాష సొగసు పద్యంలోనే వికసింపచేశారు. ఇతిహాసాలూ, కావ్యాలు, పద్యాలతోనే నింపిన ఘసందైన భాష మన భాష. ●


*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

మారుతున్న కాలాన్ని ముందుగానే గ్రహించి కుటుంబ స్త్రీలు కళారంగ సేవ చేయాలనిన

# కొమ్మూరి పద్మావతి దేవి!

## - సినిమా నాటక రంగ నటీమణిగా తొలి ప్రవేశం చేసిన తరుణీమణి!!! -



కూచిపూడి బ్రాహ్మణులు నృత్య, నాటక, రంగాలను ప్రాణంగా భావించి, ప్రఖ్యాతి నొందింపచేసిననూ, తమ యింటి స్త్రీలను రంగప్రవేశం చేయనీయలేదు. వారే కాదు ఆంధ్రదేశంలో ఏ కుటుంబ స్త్రీలూ రంగస్థలమ్మీదకానీ, సినీమాల్లోగానీ నటించడానికి అంగీకరించలేదు. ఇహ బ్రాహ్మణుల విషం వేఱే చెప్పాలా? రంగస్థల నాటకాల్లో స్త్రీలు పాల్గొనని ఛాందసపు రోజులు.

ఆ రోజుల్లో బ్రాహ్మణకుటుంబంలోని ఆడపిల్లలు ప్రారంభపాఠశాల విద్యతోనూ, కళాభిమానం కలవారయితే ఇంట్లో హార్మోనియం, వీణలపై సంగీతమును అభ్యసింప చేసేవారు. అలాటి రోజులలో పద్మావతిగారి తల్లిదండ్రులు ఆమెను ఉన్నత విద్యనభ్యసింపచేసారు. అటు తరువాత సంస్కారవంతుడూ, విద్యావంతుడైన కొమ్మూరి వెంకట్రామయ్యగారితో వివాహం జరిపించారు. వెంకట్రామయ్యగారి అన్నగారు చలం అభ్యుదయ భావాలు కల రచయిత. పూర్తిపేరు గుడిపాటి వెంకటాచలం అయినప్పటికినీ 'చలం' అన్న మూడు అక్షఱాలు ఓ మహా ఆధునిక భావాలు కల రచయితగా సమాజంలో ఓ చలనం, సంచలనం తీసుకునివచ్చాయ్. పద్మావతీ దేవి విద్యావంతురాలు కావడం వలన, ఆమెలో ఆధునిక భావాలూ, కళలపై ఆసక్తి కలిగేట్టు చేసాయ్. ఆ రోజుల్లో ఆంగ్ల ఆంధ్ర నాటకాల్లో నటిస్తూన్న మరో సాంప్రదాయ వైష్ణవ కుటుంబంలో జన్మించిన రాఘవాచార్యులు, బళ్లారి రాఘవ అంటేనే కళాభిమాను లందరికీ ఎరుకగల సుప్రసిద్ధ రంగస్థల నటులు. ఆయన రంగస్థలమ్మీద నటించడానికి కుటుంబ స్త్రీలు ముందుకు రావాలనీ, ఇతర రాష్ట్రాల్లో ఎందరెందరో వచ్చి నటిస్తూ, నటనా రంగానికి వన్నె తెస్తున్నారని పలువేదికలపై చెప్పడం, చలంగారు కూడా స్త్రీలు అన్ని రంగాల్లోనూ ముందుకురావాలని చెప్పడంతో, పద్మావతీదేవి నాటకరంగ గద్దెనెక్కారు. అనతికాలంలోనే ఆమె నాటకరంగంలో మంచి పేరుప్రఖ్యాతుల నార్జించారు. బళ్లారి రాఘవతో 'భక్తప్రహ్లాద' నాటకంలో రాఘవ హిరణ్యకశిపునిగానూ, పద్మావతీదేవి లీలావతిదేవిగాను నటించి, జనాన్ని మెప్పించారు. 'భక్తరామదాసు', చంద్రగుప్త ఆదిగాగల పౌరాణిక చారిత్రక నాటకాల్లోనూ 'తప్పెవరిది' వంటి సామాజిక నాటకాల్లోనూ మంచి నటీమణిగా ప్రజాభిమానం సంపాదించడమే గాకుండా, కరతాళధ్వనులతో అభినందించడంతో రంగస్థలిపై సంపాదించిన ప్రాచుర్యం సినిమా రంగంలోకి కాలూనేట్లు చేసింది. దానితో ఆమె గూడవల్లి రామబ్రహ్మంగారు దర్శకత్వంలో నిర్మించిన 'రైతుబిడ్డ' చిత్రంలో బళ్లారి రాఘవతోబాటు కొమ్మూరి పద్మావతీదేవి నటించడం, ఆ చిత్రం బ్రహ్మాండమైన సంచలన విజయం సృష్టించడంతో ఆమెను నటీమణిగా తెలుగు సినిమారంగం ప్రోత్సహించింది. పద్మావతీదేవి నటించిన చిత్రాల్లో ప్రముఖంగా చెప్పుకోదగినవి 'ద్రౌపదీ మాన సంరక్షణం' (మాన సంరక్షణం తెలుగువారు ఇష్టపడలేదు– ఆ కాలంలో వచ్చిన ద్రౌపదీ వస్త్రాపహరణం'ను ఆదరించారు. ఈ వ్యాసానికి విషయం అసందర్భంగావున్న వివరాలకు బోవడం లేదు.) 'రైతుబిడ్డ', 'సుమతి', 'పెద్ద మనుషులు' చిత్రాలను ప్రముఖంగా చెప్పుకోవాలి. ఈ చిత్రాలలో కొమ్మూరి పద్మావతీదేవి అద్భుతంగా నటించారు.

నాటకాలవాళ్లు సినిమాలలో పేరుప్రఖ్యాతలు నొందినా, నాటక రంగాన్ని విడువనివారూ ఆనాడెందరో ఉన్నారు. ఈ సాంప్రదాయం తెలుగులో కన్నా, తమిళ, కర్ణాటకల్లోనే ఎక్కువగా పాటింపబడింది. పద్మావతీదేవి నటనను ఎందరో ఆదర్శంగా తీసుకుని విద్యావంతులైన స్త్రీలు నాటక సినిమా రంగాల్లో ప్రవేశించారు. పలు పాత్రల ప్రభావంతో మహిళలు విద్యావంతులు కావాలనీ, పాత సాంప్రదాయల ముసుగులో తమ అభివృద్ధికి తామే ఆటంకులు కారాదనీ ఆమె అనేక వేదికలపై, అనేకరీతుల్లో ఉపన్యసిస్తూ స్త్రీలలో చైతన్యం తెచ్చారు. స్త్రీకి కుటుంబం, ఆత్మీయత, అనురాగం, సంతానాన్ని కనడం, సంసారాన్ని చేస్తూనే స్త్రీల విద్యకూ, సంఘోన్నతికి కృషి చేయడం సాధ్యమని ఆచరణ రూపంగా నిరూపించారు. ఆమె విషయంలో కుటుంబ సహకారం, భర్త బంధువుల అడ్డుగోల పాటలేదు కాబట్టి ఆమె ఆచరిస్తూ, ఆదర్శంగా నిలువకలుగడం అనేక మహిళలకు ఆదర్శమైంది. తొలితరం నటీమణుల్లో కాలాన్ని హరించకుండా కార్యాచరణలో కృతకృత్యులయ్యారు. తోటిస్త్రీలకు మార్గనిర్దేశం చేసారు. ధైర్యాన్ని నూరిపోసారు. నేనెరింగినంత వరకూ ఆమె కుమారుడు సాంబశివరావు ప్రసిద్ధి చెందిన పత్రికా రచయిత, డిటెక్టివ్ నవలా రచయిత, కుమార్తె వరూధిని భర్త సుప్రసిద్ధ కథారచయిత 'చందమామ' సంపాదకునిగా ప్రఖ్యాతిగాంచిన కొడవటి కుటుంబరావుగారు. ఇహ గుడిపాటి వెంకటాచలం గార్ని గూర్చి సర్వులకూ విదితమే. 1908 సం॥ములో మద్రాసులో జన్మించిన పద్మావతీదేవి 1970 సం॥ములో స్వర్గస్తులయ్యారు. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)


34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై



# తెలుగు భాషను కాపాడుకోవాలి! - కె.అనిల్ కుమార్ రెడ్డి

తమిళనాట తెలుగు భాషను కాపాడుకోవాలని చెన్నై తి.తి.దే ప్రాంతీయ సలహా మండలి, మాజీ ఉపాధ్యక్షులు కె అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం (టీటీసీఏ) ఆధ్వర్యంలో 'జీవన పోరాటం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కే. అనిల్ కుమార్ రెడ్డి విచ్చేసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. టీటీ సి ఏ అధ్యక్షులు తమ్మినేని బాబు, కార్యదర్శి పూజారి రామయ్య కేశవులు, భారతి మహిళా కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ నిర్మల పలని వేలు, పుస్తక రచయిత గుడిమెట్ల చెన్నయ్య వేదిక నలంకరించారు. అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ

గుడిమెట్ల చెన్నయ్య తెలుగు భాషపై ఎంతో మక్కువతో రచనలు చేస్తున్నారని, ఇందులో ఆయన ఆవేదన, ఆక్రోశం వెల్లడవుతోందన్నారు.

తమిళనాట తెలుగు భాషపై ప్రేమాభిమానాలు తగ్గాయని, భవిష్యత్ తరాలు తెలుగు భాషను మాట్లాడుతారా? అనేది ప్రశ్నార్థకమే నన్నారు. మనమంతా తెలుగు భాషను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ విస్తాలి శంకర రావు మాట్లాడుతూ తెలుగు భాషకు సేవ చేస్తూ రచనలు చేస్తున్న చెన్నయ్య అభినందనీయులని అన్నారు. పిఆర్ కేశవులు మాట్లాడుతూ గుడిమెట్ల చెన్నయ్య తన కవిత ఝరిని జీవన పోరాటంలో వినిపించారని, ఇందులో వ్యక్తిగత సమస్యలు, సమాజంలో ఒడిదుడుకులు, స్త్రీలకు జరిగే అవమానాలు చక్కగా సరళమైన భాషలో తెలియజేశారు అన్నారు.

డాక్టర్ నిర్మల పలని వేలు పుస్తక సమీక్షలో చెన్నయ్య కవిగా గెలిచారని, మనిషికి పుట్టినప్పటినుంచి పోరాటమేనన్నారు. గుడిమెట్ల చెన్నయ్య స్పందిస్తూ ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్నారు. తనకు సాహిత్యం పై అవగాహన లేదని, సాహితీపరుడిని కాదన్నారు. తనకున్న ఆవేశాలు, ఆవేదనలు అక్షర రూపేనా పెట్టానన్నారు. జీవన పోరాటం గా ఈ పుస్తకాన్ని మీ ముందు ఉంచినట్లు తెలిపారు. ●

# తెలుగువారి నోరూరించే చింతపండు, ఉసిరి, మిరపపండు పచ్చళ్లు!

చింతచెట్టూ చిగురుచూడూ
చిన్నదానీ సొగసు చూడూ!

-అంటూ మా చిన్నప్పుడు గ్రామాల్లోని పిన్నలూ, పెద్దలూ హుషారుగా పాడుకొనేవారం.



చింత చిగురు నుంచీ చింతకాయ, చింతపండు వరకూ జిహ్వాను, రుచింప చేసేదేదయా అంటే చింతచెట్టే! ఆవకాయ వంటి ఊరగాయ వలెనే చింతకాయల్ను పచ్చళ్లుగా పెట్టుకుంటూంటారు. పాత చింతకాయ పచ్చడిని సత్యంగా కూడా తెలుగువారు గ్రహిస్తారు.



చింత చిగురుపప్పు తినరా, చింతలన్నీ బాపునురా, జిహ్వా చింతలన్నీ బోవునురా అని ఉవ్విళ్లూరే తెలుగు కుటుంబాలను కూడా చూశాను. అలాగే చింతపండు తోలువలచి, గింజలు తీసి, ఎండపెట్టి ఏడాది వరకూ నిలువ ఉంచుకునే గృహాలెన్నో ఉన్నాయ్. చింతకాయ పచ్చడిగానే గాకుండా, చింతపండును ఇతర పచ్చళ్లలోను, పులుసులలోనూ, చారు (రసం) లోనూ, కూరల్లోనూ ఉపయోగించని కుటుంబమే ఉండదు. షడ్రుచుల్లోని పులుపుకు, చింతపండుకే అగ్రస్థానం యిచ్చారు. పులిహోరలో ప్రధాన దినుసు చింతపండే. ఆరోగ్యరీత్యా కూడా చింతపండు అవసరం ఎంతో ఉన్నది. ఆయుర్వేద మందుల్లో అనుపానాల్లో కూడా చింతగుంజును వాడతారు.



చింతకాయ, పెద్ద ఉసిరికాయ, ఎర్ర మిరపళ్లను కలిపి ఊరగాయగా పెట్టుకునే వారెందరో ఉన్నారు. గుంటూరు జిల్లాలోనూ, కొన్ని తెలుగు కుటుంబాల వారు ఎర్రమిరపళ్ల తొక్కులో చింతపండు పులుసుగానూ, సమపాళ్లలో ఉప్పునూ, నూనెనూ చేర్చి 'కొరివి కారపచ్చడి' అనే ఊరగాయను పెట్టుకుని, నేయి వేసుకుని కమ్మగా, కారాన్ని ఓరుస్తూ తినే వారెందరో ఉన్నారు.

అలాగే ఆంధ్రులకిష్టమైన దోసకాయలో కూడా, చింతకాయ గుజ్జును కలిపి 'పచ్చడి' చేసుకుని తినేవారెందరో! ఇహ పెళ్లిళ్లలో 'దప్పళం' అని చేసుకునే పులుసులో చింతపండు గుజ్జును కలుపుకుని పులుసు చేసేవారు. 'హుళి' (కన్నడవారు చేసేవారు చింతపండునే వాడతారు. అలాగే ఉసిరి కాయను కూడా ముక్కలుగా నరికి ఉప్పులో ఊరబెట్టి ఉసిరిపచ్చడిని చేసుకుంటారు. ఇది ఏటికి ఏడాదీ నిలవ ఉంటుంది. ఈ ఉసిరి కాయ అంటే చిన్న ఉసిరికాయ కాదు పెద్ద ఉసిరి కాయ. దీనినే రాక్షస ఉసిరికాయ అంటారు. ఇది పులుపుతో బాటు కొంచెం వగరుగా కూడా ఉంటుంది. ఈ పెద్ద ఉసిరిని ఉప్పు కారంలో ఊరేసుకుని తినే దక్షిణాదులెందరో ఉన్నారు. ఈ పెద్ద ఉసిరికాయనే ఆయుర్వేదం మందుల్లో వాడతారు. ఇది పత్యంగా కూడా ఉపకరిస్తుంది.

ఆదివారం రోజున, రాత్రి సమయాల్లోనూ కొందరి పచ్చడిని వాడరు. కానీ మొదటి అన్నం ముద్దను ఉసిరికాయ పచ్చడితో తినడం ఆరోగ్యకరమని చెబుతారు.

పెద్దలు (పూర్వులు) అనుభవపూర్వకంగా ఏర్పరచిన ఆరోగ్య ప్రదమైన పచ్చళ్లు, రుచికరమైన పచ్చళ్లు. వీటి రుచిని తెలుగు వారు ఎరిగినంతగా ఇతరులు ఎరుగరు అనేది నిర్వివాదాంశం.! ●

## పరమార్థ కథలు

## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

శ్రీశుకబ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి

# తారకవిద్య



పూర్వమొకానొక పండితుడు సర్వవిద్యా పారంగతుడు పాదచారియై యాత్ర చేసికొనుచు పోవుచుండెను. దారిలో నొకచోట నది ఒకటి అడ్డము రాగా దానిని దాటవలసివచ్చెను. నదిలో నీరు వెల్లువలుగ ప్రవహించుచుండెను. ఒడ్డున ఒక బెస్తవాడు చిన్నపడవ నొకదానిని ఉంచుకొని యుండుట జూచి ఆ పండితుడు వానితో సంభాషించి ఆవలి యొడ్డునకు పోవుటకు ఏర్పాటు చేసికొనెను. ఇరువురును తెప్పలోనికి ఎక్కిరి. బెస్తవాడు పడవను నడుపుచుండెను. పండితుడు నావలో కూర్చొని దీర్ఘాలోచనా తత్పరుడై యుండెను. ఏమి ఊహ జనించినదో కాని అకస్మాత్తుగ నాతడు ఆ పల్లెవానిని పిలిచి 'ఓయీ! తర్కవిద్య నీవేమైన అభ్యసించినావా?' అని అడిగెను. బెస్తవాడు పడవను నడుపుచునే 'లేద'ని జవాబిచ్చెను. అటుపిమ్మట వారిరువురి మధ్య ఈ క్రింది సంభాషణము నడచెను.

పండితుడు:– ఛీ, ఛీ, తర్కవిద్య నేర్వని జీవితము జీవితమేనా? అట్టి అపూర్వ విద్యను నేర్చుకోనందువలన నీ జీవితములోని పాతిక భాగము వ్యర్థమైపోయినదని నేను తలంచుచున్నాను. ఇప్పుడైనను నాబోటివారి దగ్గర నేర్చుకొని బాగుపడు! అయితే సరే, కాని మిమాంస ఏమైన చదివినావా?

బెస్తవాడు:– బాబూ! మిమాంస సంగతి నాకు ఏమీ తెలియదు

మా మాంసం సంగతి మాత్రము తెలుసును.

పండితుడు:– ఓరి వెఱ్ఱివాడా! మిమాంస నేర్చుకొనని వాడెవడైనా ఉండునా? అది నేర్వనందువలన నీ జీవితమములో ఇంకొక పాతిక భాగము వృథా అయినదని నేను భావించుచున్నాను. పోనీ జ్యోతిష్యము చదివినావా?

బెస్తవాడు:– బాబూ అది అంతకంటెను నాచేత కాదు.

పండితుడు:–నారాయణ! నారాయణ! జీవితములో ఇంకొక పాతికభాగము నాశనము చేసికొనినావురా వెఱ్ఱివాడా! తర్క, మిమాంస, జ్యోతిషములను మూడు శాస్త్రములను తెలియనివాడు ముప్పాతిక జీవితము దండుగ జేసికొనినట్లే యని గ్రహింపుము!

ఈ ప్రకారము వారిరువురి మధ్య సంభాష ణము జరుగుచుండ పడవ సరిగా నదీమధ్య భాగవనకు జేరెను. నీటి ప్రవాహము చాల వడిగా నుండెను. ఇంతలో పెనుగాలి వీవదొడగెను. తుఫాను చెలరేగెను! నదీజలము ఉత్తుంగతరంగ సంయుక్తమైభీతిని గొలుపుచుండెను. పడవ తరంగముల తాకిడికి డోలాయమాన మగుచుండెను. ఇంతలో పడవలోనికి నీరు ప్రవేశించెను. తత్ఫలితముగ పడవ నెమ్మదిగా మునుగజొచ్చెను. ఆ ఘోర విపత్సమయమున బెస్తవాడు పండితుని పిలిచి "అయ్యా బాబూ! తమకు ఈత విద్య వచ్చునా"? యని అడుగగా "రాదని" జావాబిచ్చెను. అది విని ఆ పల్లెవాడు "మహాప్రభూ! తర్క, మిమాంస, జ్యోతిషములు చదువనందున నా జీవితములో ముప్పాతిక భాగము మాత్రమే నాశనమైనది. "ఈతవిద్య' రానందువలన తమ జీవిత మిపుడు మొత్తము మొత్తముగానే (100%) నాశనమై పోయినది" అని పలికి యూరకుండెను.

ఇంతలో పడవ మునిగి పోయెను. పండితుడు గంగార్పణ మయ్యెను. బెస్తవాడు ఈదుకొని ఒడ్డు చేరెను. చూచితిరా! నదీప్రవాహ మధ్యమున కావలసిన విద్య ఏది? ఈతవిద్య. ఆ సమయమున తర్కముగాని, మిమాంసగాని, జ్యోతిషముగాని, హిస్టరీ గాని, జాగ్రఫీగాని, ఆల్జీబ్రాగాని, జ్యామెట్రీగాని ఏదియు జీవుని రక్షింపజాలదు. మునుగువానికి ఈత విద్య ఒక్కటియే శరణ్యము. అట్లే జీవుడు సంసార సాగర మధ్యమున గ్రుంకులిడుచున్నాడు. అట్టివానికి తరణోపాయము బ్రహ్మవిద్యయే. అక్షరపరమాత్మతత్త్వమే. ఆ విద్య ఒక్కటియే జీవుని తరింపజేయగలదు. కనుకనే దానికి "తారకవిద్య" యని పేరు వచ్చినది. భవదుఃఖశమనమునకై మనుజు డద్దానిని తప్పక పరిగ్రహించ వలయును.

**నీతి:–** నదిని దాటుటకు ఈత అవసరమైనట్లు సంసారమును దాటుటకు బ్రహ్మవిద్య అవసరము, కావున దానిని బడయుటకై జీవుడు ప్రయత్నించవలయును. ●


## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత **26** సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**

**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్టమాంబళం, చెన్నై – 33.**

**మొబైల్ : 98400 48941**



## నేడు గణితబ్రహ్మగా పేరొందిన

# లక్కోజు సంజీవరాయ శర్మ

ప్రపంచంలో ఆరు వేల గణితావధానాలు చేసిన ఏకైక వ్యక్తి. సంజీవరాయశర్మ 1907 నవంబర్ 27న కడపజిల్లా ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరులో జన్మించాడు.

జన్మతః అంధుడు. అప్పట్లో బ్రెయిలీ లిపి కానీ, అంధుల్ని చేరదీసే వ్యవస్థ కానీ లేదు. శర్మ గారి అక్క పాఠశాలలో చదివినవి ఇంటి దగ్గర గొంతెత్తి బిగ్గరగా మననం చేస్తే అవి విని గుర్తు పెట్టుకుని గణితంలో అపార విజ్ఞానం సాధించాడు.

తండ్రి మరణించడంతో తల్లి పెంచి పెద్దచేసింది. కల్లూరులో రైతులకు ధాన్యం ధర, భూమి కొలతలు చెప్పేవారు. వారు ఆయనకి కొంత సొమ్ము చెల్లించే వారు. గణితంలో పేరు ప్రఖ్యాతులు పొందుతున్న కాలంలోనే ఆయన వయొలిన్ పట్ల ఆకర్షితుడై నేర్చుకొన్నారు.

శ్రీ సంజీవరాయశర్మ తొలిసారి 1928 లో గణితావధానం నిర్వహించారు. అప్పటినుంచి 1995వరకు ఆయన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బీహారు, ఢిల్లీ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి ఆరువేల ప్రదర్శనలు ఇచ్చాడు. మహానగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు లలోను పలు ప్రదర్శనలను ఇచ్చారు.


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*


అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు 1928 నవంబర్ 15న నంద్యాలలో జరిగినపుడు ప్రధాన ఆకర్షణ శ్రీ సంజీవరాయ శర్మ గారి గణితావధానమే.

సాధారణంగా గణితావధానంలో, పుట్టిన తేదీ ఇస్తే అది ఏ వారము అయిందో చెప్పడం ఒక అంశం–కాని, ఈ విషయంలో శ్రీ సంజీవరాయ శర్మకు ఒక ప్రత్యేకత ఉంది.

ఆ పుట్టిన తేదీ ఏ వారము అయినదో చెప్పడమే కాకుండా, ఆనాటి పూర్తి పంచాంగము చెప్పేవారు. అంటే, పుట్టిన తేదీ, సమయము, ప్రదేశము చెప్పగానే, దానికి సంబంధించిన తిథి, వారము, నక్షత్రము, కరణము, యోగము, వర్జ్యము, రాశి కూడా చెప్పి, కొంతవరకు జాతకం కూడా చెప్పేవారు.

ఈ ప్రత్యేకతను (మానవ గణన యంత్రంగా [Human Computer] పేరొందిన శకుంతలా దేవితో సహా) మరెవరూ చూపలేకపోయారు. ఆవిధంగా,

ఇది అనితర సాధ్యమైన ప్రత్యేకత. 1966 డిసెంబరు ఏడో తేదీ.. అది హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం వేదిక 2 power 103 ఎంత?

దానికి సమాధానంలో ముప్పైరెండు అంకెలున్న సంఖ్య చెప్పారు అవధాని.

'క' నుంచి 'క్ష' వరకు ఉన్న అక్షరాలకు వరుసగా నంబర్లు వేస్తే, 'స, రి, గ, మ, ప, ద, ని" అక్షరాల లబ్దం ఎంత? ఏభై రెండు కోట్ల అయిదు లక్షల ఆరువేలు...

కలం, కాగితం రెండూ ఉన్నా గంటల కొద్దీ సమయంలో కూడా చెప్పలేని సమాధానాల్ని ఆయన ప్రశ్న అడిగినంత సులభంగా, ఏమాత్రం తడుముకోకుండా, ఆలస్యం లేకుండా సమాధానం చెప్పేవారు! ఆయనేమన్నా విద్యావంతుడా?... కాదు.

పోనీ రెండు కళ్లూ ఉండి అంకెలిలా ఉంటాయి, సంఖ్యలిలా ఏర్పడతాయని చూడగలిగిన వారా ?... కాదు. పుట్టుగుడ్డి!

పై ప్రశ్నల వంటివి ఆయన్ని వేలల్లో అడిగారు. ఆయన చెప్పిన సమాధానాలు సరిచూడడానికి గణిత మేధావులకు గంటల తరబడి సమయం కావలసి వచ్చింది).

ఆయనే గణిత బ్రహ్మ డా. లక్కోజు సంజీవరాయశర్మ "అంకెల ఆకాశంలో అమావాస్య చంద్రుడు. ప్రపంచంలో ఆరువేల గణితావధానాలు చేసిన ఏకైక మేధావి!" శ్రీపాద కథల్లో వడ్ల గింజల ప్రస్తావన తెలిసిందే. రాజుని చదరంగంలో ఓడించినందుకు బహుమానంగా...

మొదటి గడిలో ఒక వడ్లగింజ,

రెండో గడిలో రెండు గింజలు,

మూడో గడిలో నాలుగు, నాలుగో గడిలో ఎనిమిది... ఇలా అరవై నాలుగు గళ్లు నింపి ఇమ్మంటాడతను. రాజు ఓస్ ఇంతేనా అనుకొంటారు. తీరా ఎన్ని వడ్ల గింజలో తేల్చాల్సి వచ్చేటప్పటికీ.. అందరూ తలలు పట్టుకుంటారు!

దానికి సంజీవరాయశర్మ చెప్పిన సమాధానం... "ఒక కోటి 84 లక్షల,

46 వేల 74 కోట్ల 40 లక్షల,

73 వేల, 70 కోట్ల, 95 లక్షల 51 వేల, 615 వడ్ల గింజలన్నమాట... (1,84,46,74,40,73,70,95,51,615!)

ఒక ఘనపు మీటరు పరిమాణం ఉన్న బస్తాలో దాదాపు ఒక కోటి యాభై లక్షల వడ్లగింజలు పడితే...

అటువంటి బస్తాలు ఒక కోటి ఇరవై లక్షల వేల కోట్లు ఘనపు మీటర్ల బస్తాలు అవసరం! నాలుగు మీటర్ల ఎత్తు, పది మీటర్ల వెడల్పు గల.. ఒక గాదెలో ఆ ధాన్యం నింపాలంటే ఆ గాదె పొడవు మూడు వందల కోట్ల కిలోమీటర్లు ఉండాలి. ఈ దూరం భూమికీ సూర్యుడికీ మధ్య ఉన్న దూరానికి 20 ఇంతలు!

అంత ధాన్యం ఈ భూమండలంపై ఉండదు! ఇదంతా అబ్బురమని పించవచ్చు. కానీ సంజీవరాయశర్మ గణితావధాన వివరణ మహిమ అదంతా! ఒకటి, రెండు, మూడు.... ఎలా ఉంటాయో తెలియకుండానే గణితబ్రహ్మ అయ్యారు!

సంవత్సరాలు, తిథులు, నెలలు, నక్షత్రాలు, వారాలు, పక్షాలు... గంటలు, నిముషాలు, సెకనులు ఏవీ తెలియకున్నా అన్నీ తెలుసుకొని గణితంలో అపార విజ్ఞానం సాధించారు.. తొలిసారి 1928లో గణితావధానం నిర్వహించిన అప్పట్నించీ

# పచ్చదనపు పైరులు వారిన దేశమేనా- అనే సందేహం వస్తున్నది

**జం**బూద్వీపంలో భరతఖండం ఎంతటి పుణ్యభూమి, కర్మభూమిగా ఎంతగా ప్రసిద్ధి చెందిందో- త్రిలింగదేశమైన తెలుగుదేశం అంతకన్నా ఆరాకులు ఎక్కువ చదివిన విజ్ఞానభూమి. పంట భూమీ కాకుండా ఫల వృక్ష భూమి, పాడి సంపదగల భూమి ఎన్నో అందమైన పర్వతాలు, వాటిల్లోని వాగులు, వాగుల వంక జనారోగ్యాన్ని కూర్చే ఔషధ మొక్కలూ, నిరంతరమూ ప్రవహించే జీవనదులు, కలిసికట్టుగ జీవించే వివిధ చేతివృత్తులవారూ, ఊరిపొలమేర దాటకుండానే దొరికే నిత్యావసర వస్తువులు, పరికరాలు, పచ్చకోక కట్టుకున్నట్టుగా ఉండే ప్రకృతీ పచ్చని పొలాలు, వాటిలో పశువుల కొట్టాలు, వాటి మలముతోనే తయారయ్యే ఎరువులు, భూమిని గిచ్చితే చాలు ఆకాశ గంగలా ఎగసివచ్చే నీరూ, నీటి సమృద్ధిని జూచి పొలములో నాటే నార్లూ! చేలో వరి, గోధుమలు, జొన్నలు పండిస్తుంటే- చేలగట్టపై కంది, పెసర, మినప పప్పుధాన్య మొక్కలు, చిన్నచిన్న బోయలలోనే దోసెల్లతో చక్కగ త్రాగడానికి నోటికి అందే తాగునీరు.

గ్రామాల్లో పెద్ద పెద్ద అరుగులు గల ఇళ్ళు, తాటాకుటింటి చూరులో గుచ్చంగా కట్టిన వరికంకెలు, వాటిని తినటానికి వచ్చే పక్షులూ, పొరుగూరి నుంచి వచ్చేవారు ఆ అరుగులపై విశ్రాంతి తీసుకుని, వారిచ్చిన చద్దన్నముతిని ఎండపొడరాకుండా తమ తమ నెలవులకు పోయే సౌకర్యం! పట్టణాలకు వెళ్లాలన్నా, పట్టణాల్లోని సినిమాలకు వెళ్ళాలన్నా ఒంగోలు గిత్తల వంటి రెండెండ్ల బండ్లు, వాటి కొమ్ములకు కట్టిన రంగురంగుల గుడ్డలూ, మెడలో కట్టిన గంటలతో ఘల్లుఘల్లుమని సవ్వడి చేస్తూ వెడుతుంటే **ఊరూ చేరాలీ, మనగిత్తలు ఉరకలు వేయాలి పరుగులు తీయాలీ** అనిపాడుకుంటూ వేగంగా వెడుతూంటే మనసు నీటి బుగ్గలా ఉబికి నర్తించినట్లు పొంగివచ్చే ఆనందమే ఆనందం.

అరుగలు మీదనో, పొలాల చెట్ల నీడనో పలకలపైన, నేలపైన, **అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ** రాస్తూ పొలానికి అమ్మ చద్దిన్నము తీసుకుని రాగానే **ఆఆ ఆఅం** అంటూ నోట్లో పెట్టించుకునే పిల్లలూ! విషయాలు చూస్తుంటే మనముండేది కదా బృందావన స్వర్గసీమ అనే ఆనాటి అనుభూతులను నెమరేసుకుంటూన్న రోజులు పోయాయి. ఈనాటి ఎడారులలా పచ్చదనం కోల్పో యిన భూములు, పంట కాలువల తోనూ నీటి బోదులూ, బోర్‌వెల్‌ల ధమ ధమలూ, ఎప్పుడు కరెంటు వస్తుందో ఎదురుచూచే పల్లె రైతు చకోరపు చూపులూ, మనం ఉన్నది ఆంధ్ర దేశమేనా అనిపిస్తూంటుంది.

> **అమెరికా బడులలో చెప్పే తొలివాక్యం**
>
> **TELL THE TRUTH!**
>
> **సత్యమే చెప్పుము.**
>
> నిజానికిది భారతదేశ వేదవాక్కు!
> సత్యం వద- ధర్మం చర!
> సత్యం మాట్లాడు! ధర్మంగా నడుచుకో!
> మన జన్మహక్కుగా ఉండే నీతి వాక్యాలు, పాశ్చాత్య దేశాలకు

ఇలా **దేశాన్ని మరుభూమిలా మార్చిన వారిని నాటుగొడ్డలితో నరకా లనిపిస్తుంది.** మొదట్నుంచీ ఆంధ్రదేశ వాసులు పరోపకార పరాయణత్వము లోనే జీవించారు. తాము జీవిస్తూ, ఇతర జీవులను జీవింపజేశారు. చీమకైనా హాని తలపెట్టని జాతి తెలుగుజాతి. నిరక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉన్ననూ, వేద పురాణేతిహాసాల సారాంశాన్ని పుక్కిట పట్టి ఉంచేవారు. పల్లెసీమల్లో మనిషీ, గొడ్డు గోదా సుఖంగా జీవిస్తూ, ధర్మశీలంతో ధర్మకార్యాలను నెరవేరుస్తూ **గోబ్రాహ్మణ హితాయిచ** యని తమ తమ వృత్తి ధర్మాలను అనుసరిస్తూ, కులా కాలుష్యన్నెటిగినవారు కారు, సత్యం, ధర్మం, క్షమ, సహనాలతో పొలంపనులతో పగలంతా గడిపి, సాయంకాలానికి ఇంటికి చేరి శుచియై, ఆయా వూరి ఆలయములకు వెళ్లి ప్రార్థనచేసి ఇంటికి వచ్చి, భార్యాపిల్లలతో సంతోషంగా కలిసి భుజించడం ఆనాటి అలవాటు. ఆడవాళ్ళు ఇచ్చకాలాడకుండా, అధ్యాత్మ రామాయణ కీర్తనలూ, భారత భాగవత పద్యాలూ పాడుకుంటూ, ఇరుగింటి పొరుగింటి వారలతో మంచి చెడులను మాట్లాడుకుంటూ సత్కాల క్షేపం చేసే దేశమే ఆంధ్రదేశం. సినిమాల్లో చూపించినట్లు, కక్షలూ, కార్పణ్యాలు, వాదాలు, వాజ్యా లుండేవికావు. ఊరిలోగానీ, ఊరిజనుల్లోగానీ ఏదైనా సమస్య ఉంటే ఊరిపెద్దలే రచ్చబండపై పరిష్కరించుకునే పద్ధతి ఉండేది. ●

---

1995 వరకు ఆయన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, బీహారు, ఢిల్లీ రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి ఆరువేల ప్రదర్శనలు ఇచ్చారు. మహానగరాలైన ఢిల్లీ, ముంబాయి, చెన్నై, బెంగుళూరు, హైదరాబాదుల్లోను పలు ప్రదర్శనలు నిర్వహించారు.. అప్పట్లో మద్రాసు గవర్నరు, భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వంటి జాతీయ ప్రముఖులు

ఆయన మేధాశక్తికి ఆశ్చర్యచకితులయ్యారు! నాలుగువేల సంవత్సరాల వరకు సరిపోయే క్యాలండరు సైతం తయారుచేశారు. అప్పటి నరాష్ట్రపతి డా. నరాజేంద్ర ప్రసాద్ శర్మ ప్రతిభకు ముగ్ధులై తన దగ్గర ఉన్న సొమ్ము ఎం.ఓ చేయడం విశేషం!

అప్పట్లో అనీబ్‌సెంట్, నెహ్రూ, రాజేంద్రప్రసాద్‌లతో పాటు, బెజవాడ గోపాల రెడ్డి, శ్రీమాలి, హుమాయూన్ కబీర్, కాశీనాధుని నాగేశ్వరరావు, పి.వి.రాజమన్నార్, గవర్నర్ సర్ జార్జి స్టాన్లే, మేథ్స్ విజార్డ్ శకుంతలాదేవి తదితరులంతా శర్మ గణితావధాన.. ప్రదర్శనలు స్వయంగా తిలకించి అన్యులకు సాధ్యం కాదని వేనోళ్ల కీర్తించారు.

శర్మ పలు విశ్వవిద్యాలయాల్లో, ప్రసిద్ధ కళాశాలల్లో అవధానం ప్రదర్శించి విద్యార్థుల్ని ఉత్తేజితుల్ని చేశారు. అలాగే గ్రంధాలయాల పిలుపునందుకొని పలు గ్రంధాలయాల్లోనూ తమ గణితావధాన ప్రదర్శనలు చేశారు.

అలాగే మేథమేటికల్ సొసైటీల ఆహ్వానం మేరకు వాటి సభ్యుల ముందు ప్రదర్శనలిచ్చారు.

ఆయన ప్రతిభ రాయలసీమ నుంచి అంతర్జాతీయ వేదికలకెక్కింది. దురదృష్టం ఏమిటంటే 1993లో అమెరికా సందర్శించాలని ఆయన్ని అక్కడి తెలుగు సంఘాలు ఆహ్వానించినా సకాలంలో వీసా రాకపోవడంతో ఆ మేధావి ఇల్లు కదలలేక పోయారు.

వివిధ విశ్వవిద్యాలయాలు... ఆయన్ని సత్కరించాయి. కొన్ని ఆయన్ని బంగారు పతకాలతో సత్కరించాయి. దురదృష్టమేమిటంటే 1964 అక్టోబరు పదో తేదీన శర్మ రేణిగుంట నుంచి తిరుపతికి రైల్లో ప్రయాణిస్తున్న సందర్భంలో ఆయన 14 బంగారు పతకాల సూట్‌కేసును దొంగలు తస్కరించారు.

ప్రపంచంలో అంధులైన మహా ప్రతిభావంతుల్లో జాన్‌మిల్టన్, బ్రెయిలీ కనుగొన్న హెల్‌న్ కెల్లర్, ద్వారం వెంకటస్వామినాయుడు వంటివారు పుట్టుకతో అంధులు కారు. తదనంతర కాలంలో వారు అంధులయ్యారు. మన దేశంలో గణిత శాస్త్రజ్ఞుల్లో భాస్కరాచార్యులు, రామానుజన్, శకుంతలాదేవి వంటివారు.. మంచి శిక్షణ పొందారు. కానీ సంజీవరాయశర్మ అంధుడే కాక చదువు సంధ్యలు లేని వ్యక్తి. అంతా వినికిడి జ్ఞానమే... ప్రపంచంలో ఆరుగురు గణిత శాస్త్రజ్ఞుల్లో ఒకరు

ఆనాడే బ్రిటిష్ వైస్రాయ్ "ఈయన మా దేశంలో పుట్టి వుంటే దేశం నడిబొడ్డున విగ్రహం పెట్టి రోజూ పూజలు.. చేసేవాళ్లం" అని శర్మనుద్దేశించి అన్నారు.

శకుంతలాదేవి స్వయంగా నాకన్నా ప్రతిభావంతుడు అని అంగీకరించింది. అయినా ఆయన పేదరికంలోనే జీవించారు. శ్రీనివాస రామానుజన్ వంటి మేధావిని గుర్తించని దేశమిది. అలాగే సంజీవరాయశర్మని రక్షించుకోలేక పోయింది. 1997 డిసెంబరు రెండోతేదీన సంజీవరాయశర్మ అస్తమించారు. 'అంక విద్యాసాగర' విశ్వసాంఖ్యాచార్య, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్ పొందిన శర్మ తన చివరి రోజుల్ని శ్రీ కాళహస్తీశ్వర స్వామి సన్నిధిలో వయొలిన్ మీటుతూ స్వామినర్చిస్తూ గడిపారు!

నిజానికి... ఈ నోబెల్ బహుమతులు, మెగ్‌సెసేలు, జ్ఞానపీఠ్‌లు...

ఆయన ప్రతిభ ముందు ఎంత చిన్నవో! ●





# స్వామియే శరణం అయ్యప్ప

విశ్వమండలి జలమంతయూ గంగా జలంగా మారే మకర సంక్రాంతి శుభదినాన అశేష జనావళి విశేషముగా సంక్రాంతి పర్వదినమును జరుపుకొనుచుండగా, "స్వామియే శరణం అయ్యప్ప" అంటూ నల్లని దుస్తులతో, పెరిగీ పెరగనట్టున్న గడ్డంతో, నుదుటన చందనమును ధరించి ఇరుముడిని నెత్తిపై నుంచుకొని అయ్యప్ప భక్తులు స్వామి దర్శనార్థమై శబరిమలైకి పోవుచుందురు.

అనంతరూపుడైన భగవానుని మూర్తులలో "స్వామి అయ్యప్ప" ఒక మంగళ మనోజ్ఞమూర్తియై ఉన్నది. ప్రతి సంవత్సరము లక్షలాది భక్తులు వెళ్ళి దర్శించు ఈ స్వామి అయ్యప్ప మూర్తి వైభవమును, యాత్రలోని ఆధ్యాత్మిక అవగాహనను తెలిసికొందుముగాక!

**ఇరుముడి :**

అయ్యప్ప దర్శనానికి బయలుదేరు అనుష్ఠాన భక్తులు "ఇరుముడి" అనుదానిని తయారుచేసుకొని దానిని తలపై నుంచుకొని బయలుదేరుట మీరు చూచియే ఉందురు. ప్రథమ సోపానమైన ఈ "ఇరుముడి"ని గూర్చి మొదట తెలిసికొందుము.

"ఇరుముడి" అనగా రెండు ముడులు వేసియున్న మూటను తలపై నిడుకొని భక్తులు బయలుదేరుదురు.

భగవద్దర్శనార్థము బయలుదేరి వెళ్ళు భక్తుడు ఎన్నడూ వెనుదిరిగి చూడరాదు. ప్రాపంచిక విషయాలపై వెన్నుతిప్పి నడక సాగించాలి. పోయేనాడు అందరూ ఒంటరివారే. ఒకరితో ఒకరు చెప్పి వెళ్ళేదంటూ ఉండదు. ఈ కారణముగా అయ్యప్ప దర్శనార్థము వెళ్ళే అనుష్ఠాన సాధకులు వెనుదిరిగి చూడకుండా, ఎవరినీ పరామర్శించ కుండా వెళ్ళుదురు.

భగవత్కైంకర్యమునకై ముందువైపున ఉంచుకొనిన మూటలో నేయి నింపి మూతవేసిన నారికేళము, కర్పూరము, అగరుబత్తిలాంటి పూజా ద్రవ్యములు ఉండును. వెనుకవైపున ఉన్న మూటలో తనకొరకుగాను తాను తీసుకొని వెళ్ళుచున్న ఆహార పదార్థములుండును.

ప్రతి వ్యక్తి తన జీవితములో ఆచరించిన కర్మల యొక్క ఫలితములే రాబోవు జన్మలకు జీవనమును సమకూర్చును అని తెలుపుటయే ఆహారపదార్థములను ఉంచుకొనుటలోని భావార్థము.

రెండవ మూటలో భగవత్పూజకు సంబంధించిన వస్తువులు ఉండును. నేతితో నింపిన కొబ్బరికాయ ఒకటి ఉండును. అగరుబత్తి, కర్పూరము ఇత్యాదులు ఉండును.

కొబ్బరికాయకు మూడు రంధ్రములుండును. ఆ రంధ్రముల ద్వారా నేతిని కొబ్బరికాయలో నింపుదురు. నింపిన తరువాత దానిని మూతపెట్టి ఇరుముడిలో కట్టుకొందురు. భగవానుని సన్నిధికి వెళ్లేంతరవకు దానిని తలపై నుండి దించరు.

**కొబ్బరికాయ :**

ప్రకృతి త్రిగుణమిళితమై ఉన్నందున మన మాచరించెడి ప్రతి కర్మమును సత్వరజస్తమో గుణాత్మికమై ఉండును. కొబ్బరికాయ పైనున్న మూడు రంధ్రముల ద్వారా నేతిని నింపుదురు. అనగా మనము తయారుచేసుకొను కర్మ సంచితమంతయు గుణమిశ్రితమై ఉన్నదని భావము. ఇలా నేతిని నింపి మూతపెట్టిన పిదప దానిని మూతతో బిగించి స్వామి సన్నిధిలో తెరచి, అందులోని నేతిని స్వామికి అభిషేక మొనర్చుదురు. ఆ మిగిలిన రెండు కొబ్బరి చిప్పలను అక్కడే వెలుగుతున్న అగ్నిగుండ ములో పడవేయుదురు. అనగా సూక్ష్మశరీరమనెడి అంతఃకరణ భగవానునికి అభిషేక రూపమున సమర్పించబడింది. స్థూల రూపమైన దేహమునూ అగ్ని గుండానికి ఆహుతి అయినది. ఎంతటి భాగ్యవంతుడైననూ ప్రతి మానవుని శరీరము ఒకనాటికి శ్మశానానికి అంకితమగునదియే అని తెలుపుటయే అందులోని అంతరార్థము.

స్వామికి సంబంధించిన ఇరుముడిలోని నారికేళము నందు నెయ్యి శరీరానికి సంకేతమని, కొబ్బరిచిప్పలు స్థూల శరీరానికి సంకేతమని గ్రహించితిమి. ఆ ఇరుముడిలో అగరుబత్తులు కూడా ఉండును. ఇవి మనలోని వాసనాత్రయమునకు సంకేతము. దేహ వాసన, లోక వాసన, శాస్త్ర వాసన అనెడి వాసనాత్రయమును స్వామికి సమర్పించుటయే అగరుబత్తులను తీసుకొని వెళ్ళుటలోని భావము. ఇక కర్పూరము సంపూర్ణ శరణాగతిని, పూర్ణాహుతిని తెలియజేయును. కర్పూరము వెలిగిన తరువాత ఏమీ మిగలదు. "భగవాన్! నీ ఆరాధనలో నన్ను నేను సంపూర్ణ ముగా సమర్పించుకొని ఏమీ మిగలకుండా ఆహుతి అగుదును గాక! ఐక్యమగుదుము గాక!" అని భావించుటయే కర్పూరమును తీసుకెళ్ళుటలోని అంతర్భావము.

**నల్లని వస్త్రము:**

అయ్యప్ప దర్శనానికరుదెంచు అనుష్ఠాన భక్తులు నల్లటి వస్త్రములను ధరించియుందురు. అది వారిలోని వైరాగ్యమును సూచించును. ఈ ప్రపంచములో లభించెడి సుఖములన్నియు అంధకారమును విరజిమ్ము అజ్ఞాన ప్రదర్శనలేనని గ్రహించుటయే నల్లదుస్తులను ధరించుటలోని భావార్థము.

**క్షురకర్మ:**

వ్రతకాలమున క్షురకర్మను ఆచరించరు. స్వామి దర్శనమై తిరిగి వచ్చిన తరువాత ఆచరించెదరు. వ్రతకాలమున పాపరహితులై యున్నందున సంకల్ప శుద్ధి అవసరము లేదు తలచుటయే క్షురకర్మను విషేదించుటలోని భావార్థము. దర్శనమై తిరిగి వచ్చిన తరువాత క్షురకర్మను ఆచరించెదరు. అనగా భగవత్సాక్షాత్కా రము తరువాత సంకల్పనాశనము జరుగునని భావించుటయే అందులోని భావార్థము.

**ఏకభుక్తము :**

వ్రతకాలమునందు సాధకులు ఏకభుక్తమునే చేయుదురు, మితాహారము సాధనకు ఎక్కువగా ఉపకరించి హితమొనర్చును. ఆదియును గాక ఏకభుక్తమును సాగించి, ఏక వస్తు చింతనమును కొనసాగించవలెనని దృఢాభిప్రాయమును కలిగి ఉండుటయే అందులోని అంతర్భావము.


ఏకభుక్తమును సాగించు సాధకులు మూడు వేళల యందు స్నానమాచరించు చుందురు. మనోవాక్కాయ కర్మలయందు త్రికరణశుద్ధిని కలిగియుండటయే మూడు వేళల స్నానమాచరించుటలోని అంతరార్థము. కామ, క్రోధ లోభములను మనస్సు నుండి దూరము చేసుకొనుటయే అందులోని భావార్థము.

ఈ వ్రతకాలమున ఏ విధమైన హింసాత్మక చర్యలుగానీ, ఆలోచనలు గానీ కలుగకుండా చూసుకొనుచుందురు. సాత్వికమైన మితాహారమును భుజించి, ఇంద్రియములను నిగ్రహించుకొనుచుందురు.

ఇన్ని విధముల ప్రయత్నించుచుండిన బలవత్తరమైన ఇంద్రియములను చంచలమైన మనోబుద్ధులు మానవుని దారి మళ్ళించి పతనము చేయు ప్రమాదము కలదు.

**స్వామి సంబోధన :**

"నాస్తి బుద్ధిః అయుక్తస్య" ఇంద్రియ నిగ్రహం లేనివానికి బుద్ధి స్థిరంగా



ఉండదు అని గీత తెలుపుచున్నది. మనోబుద్ధులు భగవంతునిపైననే నిలిచి ఉండ వలెను. అందుచేతనే అయ్యప్ప దర్శనానికి వెళ్ళు భక్తులు నిత్యము ఎక్కడో ఒకచోట నామ సంకీర్తనలో పాల్గొనుచుందురు. 'భక్తిగల వారితోనే మెలగుచుందురు. భగవానుని లీలలను శ్రవణము చేయుచుందురు. భగవానుని గూర్చియే భాషించు చుందురు. ఆలయములందే రాత్రిపూట పరుండుచుందురు. దైవస్మరణ తప్ప అన్య విషయముల పైకి మనసును పోకుండా చూసుకొనుటయే ఈ అభ్యాసముల వెనుక అంతరార్థమై ఉన్నది. సర్వులలో భగవంతునే గాంచు చుండవలయును. ఇదియే అయ్యప్ప భక్తులు ఆచరించవలసిన ముఖ్య సాధన. అందుచేత అయ్యప్ప భక్తులు అందరినీ "స్వామి" అని పిలుచుచుందురు. మనిషికి మనిషికి మధ్య భేదమును దర్శించరాదనియు, అందరిలోను, భగవంతునే వీక్షించవలయుదని భావించుటయే అందులోని నిగూఢార్థము.

**యాత్ర :**

యాత్రకు బయలుదేరిన భక్తులు వాహనములలో బయలుదేరి, మార్గమధ్యమ మున వచ్చు పవిత్రాలయములను దర్శించుచు "ఎరుమెలి" అను స్థానమునకు చేరుదురు. వాహన ప్రయాణము ఈ ఎరుమెలి వద్ద ఆగిపోవును. అక్కడ నుండి ప్రయాణమంతయు పర్వత ప్రదేశముననే జరుగును. శబరిమలైలో స్వామి ఆలయము చేరునంతవరకు ఇక కాలి నడకయే.

ఈ "ఎరుమెలి" వద్ద కూడా అయ్యప్పస్వామి ఆలయమొకటి కలదు. అచ్చట భక్తులు స్వామిని ఆరాధించుకొని బయలుదేరు చుందురు. అచ్చట బాణములు అమ్ముచుందురు. ఒక్కొక్కరూ ఒక్కొక్క బాణమును కొని చేతపట్టుకొని నడుచుచుం దురు. దీని విషయము మీకు ముందు ముందు తెలియగలదు. ఇలా బయలుదేరిన భక్త సమూహమును ఒక నాయకుడు నడుపుచుండును. భక్త బృందమునకు నాయకత్వము వహించు నాయకుని "పెరియస్వామి" లేదా "గురుస్వామి" అందురు. ఎవరు ఎక్కువసార్లు శబరిమలై యాత్ర చేసియుందురో వారే గురుస్వామి అనబడు దురు.

**తమోగుణ అంతము:**

"ఎరుమెలి" నుండి భక్తులు పాదయాత్ర చేయుచూ శబరిమలైకి పోవుదురు. "ఎరుమెలి" అను పదము "ఎరుమకొల్లి" అను పదముల యొక్క రూపాంతరము. "ఎరుమకొల్లి" అనగా దున్నపోతును చంపిన స్థలము అని అర్థము. సాధారణముగా మన శాస్త్రీయ పరిభాషలో చెప్పవలెనన్నచో యమునియొక్క వాహనము. యమధర్మ రాజు మృత్యువునకు అధిపతి. మృత్యువు అజ్ఞానరూపము. కనుక దున్నపోతును వధించుట అనగా తమోగుణమును అంతమొందించుట అని భావము. దీక్షబూని ఆధ్యాత్మిక మార్గమున చరించిన అయ్యప్ప భక్తులు "ఎరుమెలి" వద్ద తమ తమస్సును అంత మొందించాలని భావము.

ఆ తరువాత పాదయాత్ర చేయు భక్తులు రెండు కొండలను దాటుదురు. మొదటిది "కల్లితుంకున్ను" రెండవది "కరిమలై". మొదటి కొండకన్నను రెండవ కొండను ఎక్కుట బహు కష్టము.

**రజోగుణ అంతము:**

"ఎరుమెలి"ని దాటిన తరువాత వచ్చెడి ప్రశస్థమైన ప్రదేశము "కాలకెట్టి అంజలి" అనగా ఎద్దును కట్టిన చెట్టు అని భావము. "ఎరుమెలి" వద్ద తమోగుణము అంతమొందినది. "కాలకెట్టి అంజలి" వద్ద రజోగుణ సంబంధమైన పశుప్రవృత్తి అంతమొందించబడింది. అదియే ఎద్దును కట్టిన చోటు అని భావము. పశుప్రవృత్తు లను మనసులో నింపుకొని పరమాత్మను దర్శించుట దుర్లభము.

**సత్వ గుణము:**

కాలకెట్టి అంజలి దాటిన తరువాత భక్తుడు "అలస"ను సమీపించును. అలస అనగా కన్నీటి నది అని భావము. ఈ దశలో భక్తుని యందు రజోగుణము, తమోగుణము దూరమగుటచేత సత్వగుణము మదిలో కలుగును. సత్వ సంపద రాగానే భగవంతుని గూర్చిన సంకల్పాలు చల్లగా కదులును. గడచిన జీవితములో చరించిన దారుణకృత్యములు మదిని చెదరగొట్టును. పశ్చాత్తాపముతో హృది కదిలిపోవును. అదియే కన్నీటి నది అని పిలువబడినది. భగవంతుని కొరకై భక్తుని నేత్రాల వెంబడి కన్నీరు వరదలై పారిన సందర్భము ఇదియే విషాదయోగము. విషాదయోగమును కలిగిన అర్జునుడు గీతను అధ్యయనము చేయుటకు అర్హుడా యెను. విషాద యోగయుక్తుడైన పరీక్షిత్తుడు భాగవత శ్రవణమునకు అర్హుడాయెను. విషాదయోగ భరితుడైన వాల్మీకి రామాయణ గాథను రచించగలిగెను.

ఈ ఆలస వద్ద నదీస్నానమాచరించవలెను. ఆ తరువాత ఒక రాయిని చేత పట్టుకొని భక్తుడు ముందునకు కదులును. ఆలసలో చేతపట్టిన రాయిని "కలితుం కున్ను" అనెడి గిరి శిఖరమున పడవేయును. "కలితుంకున్ను" అనగా "రాయి పడవేసిన కొండ" అని అర్థము.

ఆలసానదిలో స్నానమాచరించి, భాష్పాభిషేకము జరిగిన తరువాత అక్కడ రాతిని సాధకుడు చేత పట్టుకొనును భక్తి కలిగిన తరువాత తాను భక్తుడనెడి అహంకారమును సాధకుడు పట్టుకొనును. అదియే రాయి ఎత్తుకొనుట అని గ్రహించాలి. ఈ అహంకారము బండ బరువులాంటిది. దీనిని "కలితుంకున్ను" అన్నచోట వదిలిపెట్టును కొండ శిఖరముపై వదిలిపెట్టును. అనగా ఎత్తయిన వాడగు భగవానుని పాదముల చెంత వదిలిపెట్టును.

ఆ తరువాత ప్రయాణము కొనసాగించు "కరియలంతోదు" అను ప్రాంతమును చేరును. "కరియలంతోదు" అనగా "ఎండుటాకు కాలవ" అని అర్థము. "కలితుం కన్ను" వద్ద అహంకారాన్ని వదిలిపెట్టగానే సాధకుని అంతర్యము ఎండుటాకువలె తేలికపడును. జీవనయాత్ర సౌలభ్యమును సంతరించుకొనును. ఇప్పుడు సాధకుడు "కరిమలై" వద్దకు వచ్చును.

"కరిమలై" అనగా ఏనుగుకొండ అని భావము. ఇది చాలా కష్టతరమైన ప్రయాణము. భగవత్సాన్నిధ్యము లభించే ముందు సాధకుని యాత్ర సుగమముగా నుండదు. అయిననూ సాధకుడు భక్తిశ్రద్ధలతో యాత్రను కొనసాగించవలెను. "కరిమలై"ని అధిగమించేటప్పుడు భక్తులు "స్వామియే శరణం అయ్యప్ప" అనెడి నామమును పదేపదే పలుకుతూ హృదయములో అయ్యప్ప మూర్తిని దర్శించుచూ ముందునకేగుదురు బాట దుర్గమమైనపుడు భగవన్నామమును శ్రద్ధతో పలుకవలెను. వెంటనే దుర్గమమైన బాట సుగమమగును. భక్తులు "కరిమలై"ని అధిగమించగనే అధికోత్సాహముతో ఆనందించుదురు. భగవత్ప్రాప్తి పొందుటకై మనము కఠోర సాధన లాచరించుదుము. తత్ఫలితముగా కమనీయస్థితిని బొంది తరింతుము.

కరిమలైని దాటగానే భక్తులు పూర్ణానదీ తీరమును చేరుదురు. అచ్చట స్నానమాచరించుదురు. ఈ దశలో సాధకుడు తనలోని అపరిపూర్ణ స్థితిని విడనాడి పూర్ణత్వముతో శుద్ధిపడును. ఇదియే నిత్యానంద స్థితి. సవికల్ప సమాధి.

అది జరిగిన తరువాత భక్తులు "నీలిమలై" చేరుదురు. ఈ కొండమీదనే శబరిమలై ఆలయము నిర్మింపబడియున్నది. ఈ నీలిమలైవద్ద శిథిలమైన అశ్వత్థ వృక్షము గోచరించును. ఈ వృక్షముయొక్క స్థానమును "శరంకుత్తిఆల్" అందురు. అనగా "శరము విడిచిన చెట్టు" అని భావము. "ఏరుమేలి" వద్ద సాధకుడు కొని, చేతపట్టు కొనిన బాణమును ఈ అశ్వత్థ వృక్షము చెంత విడిచిపెట్టును.

బాణము విడువబడిన తరువాత లక్ష్యస్థానమును చేరుతుంది. సాధారణముగా మనకు లక్ష్యస్థానము ప్రేయస్సేగానీ, శ్రేయస్సు కాదు. కనుక ఆధ్యాత్మిక సాధకుడు కూడా దారి తప్పినవాడై ప్రేయస్సునే లక్ష్యముగా ఎన్నుకొనును, ప్రేయస్సును సాధించే ప్రయత్నములో తాను జీవనయాత్రను సాగించును. నీలిమలైకి చేరిన తరువాత తనకు కావలసింది శ్రేయస్సే గాని ప్రేయస్సు కాదని గుర్తించి ఎరుమేలివద్ద గ్రహించిన శరమును అశ్వత్థ వృక్షముచెంత వదిలిపెట్టును. అశ్వత్థమనగా స్థిరత్వములేని సంసారమని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో పదునైదవ ఆధ్యాత్మికమునందు తెలియజేయును కనుక ఈ ప్రపంచము అనిత్యమని గ్రహించిన సాధకుడు నీలిమలై వద్ద ప్రేయస్సును పరిత్యజించి తన లక్ష్యస్థానము శ్రేయస్సేనని గ్రహించి ముందునకు సాగిపోవును. ఇదియే ఆధ్యాత్మిక ప్రయాణములోని చివరి మజిలీ.

## పదునెనిమిది:

స్వామి ఆలయమును చేరుటకు పదునెనిమిది మెట్లు ఎక్కవలెను. సనాతన ధర్మమార్గములో పదునెనిమిది సంఖ్యకు ఎంతో ప్రాశస్త్యమున్నది. సామాన్య జనులకు సైతము ఆధ్యాత్మిక జ్ఞానమునందించవలెనని. అభిప్రాయపడి పురాణములను వేదవ్యాసుడు రచించెను. అట్టి పురాణములు పదునెనిమిది కావడము గమనించదగిన విషయము. పంచమవేదమైన భారతమునందు పర్వములు పదునెనిమిదియై ఉండి భారతయుద్ధము పదునెనిమిది రోజులు జరిగెను. కురుక్షేత్రమునందు పదునెనిమిది అక్షౌహిణుల సైన్యము నిలిచియుండెను. యుద్ధానంతరము పదునెనిమిది మంది మాత్రమే మిగిలిరి. కురుక్షేత్రమునందు శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతనందు పదునెనిమిది అధ్యాయములుండగా, జ్ఞాని స్థితిని అపూర్వముగా నిర్వచించిన స్థితప్రజ్ఞ లక్షణములు పదునెనిమిది శ్లోకములయందు నింపబడెను. ఉపనిషత్తులోని ప్రథమ ఉపనిషత్తైన ఈశావాస్యము నందును, ఆద్యపురుషుని గూర్చి నాల్గు వేదములందును గానం చేయబడిన పురుషసూక్తము నందును పదునెనిమిది మంత్రములు ఉండెను. దేవికి హస్తాలు పదునెనిమిది కాగా, దేవాలయపు మెట్లు పదునెనిమిది అయ్యెను. దీనినిబట్టి చూసిన హిందూ ధర్మ శాస్త్రము నందు పదునెనిమిది అను సంఖ్యకు విశిష్ట స్థానమున్నదని తెలియుచున్నది. మానవుడు మాధవుడయ్యేందుకు చేయు ప్రయత్నములో పదునెనిమిది సోపానములను దాటవలెనని తెలుపుటయే అందులోని అంతర్భావము. స్వామి అయ్యప్ప ఆలయానికి పదునెనిమిది మెట్లు ఉండుటలో కూడా అంతరార్థమిదియే.

ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఐదు ప్రాణములు, మనస్సు, బుద్ధి అనెడి పదునేడు విషయములచేత మానవునికి స్థూల, సూక్ష్మ శరీరములు ఏర్పడినవి. పదునెనిమిదవ సోపానము కారణ శరీరమై ఉన్నది. అదియే అజ్ఞానము. ఈ పదునెనిమిది మెట్లు దాటినపుడే మనము చైతన్య జీవనము అనుభవించగలము. ఈ పదునెనిమిది వేరువేరుగా లేవు. ఇవి అన్నియు ఒకే మాయా స్వరూపమై ఉన్నందున పరస్పరము ముడిపడి ఉన్నవి. అయ్యప్ప ఆలయానికి అమర్చబడిన పదునెనిమిది మెట్లు ఒకే రాతితో ఉండుటలోని అంతరార్థము కూడా ఇదియే.

పదునెనిమిది మెట్లును ఎక్కిన తరువాత భక్తులు అయ్యప్పను దర్శింతురు. మాయను దాటినవారికి మాధవుని దర్శనము ప్రాప్తించును. "ఇరుముడి"ని ఇప్పుడు. తలమీద నుంచి దించి, అందులోని కొబ్బరికాయను పగులగొట్టి, అందులో నింపబడియున్న ఘృతముచే అయ్యప్పను అభిషేకించి, పగిలిన రెండు కొబ్బరి ముక్కలను ఆ ప్రక్కనే వెలుగుతున్న హవనకుండమునందు పడవేయుదురు. అలా అగ్నిలో పడిన కొబ్బరిముక్కలు చూచుచుండగానే దగ్ధమైపోవును.

కొబ్బరికాయలో ఘృతము నిండియున్నట్లు మనలో సంచిత కర్మనంతయు నిండియున్నది. సంచితమును స్వామికి సమర్పించగానే మన పుణ్యాపాపము లన్నియు అదృశ్యమగును. పుణ్యాపాపములు లేనపుడు, వాటిని అనుభవించు క్షేత్రముయొక్క అవసరమేమున్నది? అందుచేత కొబ్బరిచిప్పలు హవనకుండము నందు దగ్ధమైనట్లు మానవ దేహము కాష్ఠములో కాలి బూడిదై పోతుంది.

అభిషేక నీరాజనములను పూర్తి చేసుకొని, చేతులు జోడించి నమస్కరించుచు, హృదయ స్పందనతో ఆనందాశ్రువులను దాల్చుచున్న భక్తసమూహమునకు అయ్యప్పస్వామి చిన్ముద్రను చూపుచు మొసంగును. జీవుడనెడి చూపుడువ్రేలు బ్రహ్మయనెడి బొటనవ్రేలుతో కలిసియుండ మిగిలిన మూడువ్రేళ్లు అనెడి అవస్థాత్రయము దూరముగా నిలిచియుండుటయే చిన్ముద్రలోని అంతర్భావము. ఆధ్యాత్మిక సాధకుడు ఆచరించి తరించుటకు అనువుగా ఏర్పడిన ఈ అయ్యప్ప యాత్రలోని విశిష్టాంశములను గ్రహించినాము. కానీ ఇచ్చట ఒక విన్నపమును చేయకుండా వ్యాసమును ముగించినచో హితకరమగు ఈ ప్రయత్నము హానికరముగా పరిణమించినను అతిశయోక్తి కాదని భావించి కొన్ని చేదు నిజాలను చేర్పించుటకు నేను వెనుకాడుట లేదు.

భక్తులారా! వ్యవస్థ ఎక్కువగా కదిలే సమయాన వ్యవసనం చోటుచేసుకొనే ప్రమాదం ఉంటుంది. వ్యసనాన్ని తొలగించుకుంటూ వ్యవస్థవైపు నడక సాగించినపుడే సమాజానికి స్థిరత, జనానికి సుస్థిరత చేకూరుతాయి.

చరిత్రను చక్కగా పరిశీలించి, విశ్లేషించి అవగత మొనర్చుకొనినచో ఎన్నో సాంప్రదాయాలు గతంలో కదిలాయి. కదిలినట్లే కదిలి కనుమరుగయ్యాయి. ఆధ్యాత్మిక సాధన ఏదైననూ ప్రారంభమునందు విశిష్టముగనే గోచరిస్తుంది దినములు గడచి జనములు పెరిగి మననము లోపించినపుడు, దిక్కులు పిక్కటిల్లేలా ఎదిగిన ఉద్యమాలు దిక్కులేనివియై చిక్కులలో పడిపోతాయి. సనాతన ధర్మమార్గమున చరించువారెవ్వరూ మూఢ విశ్వాసాలకు బానిసలు కారాదు.

"అయ్యప్ప యాత్ర" ఇటీవల కాలంలో చాలా అద్భుతంగా, అనూహ్యంగా అభివృద్ధి చెందింది. చాలా సంతోషకరమైన విషయం.

ఆధ్యాత్మిక అవగాహనతో ఏర్పడిన ఈ అయ్యప్ప యాత్ర సాధకులకు చక్కని సోపానములను అమర్చి పెడుతుందని నిస్సందేహముగా నేను అభిప్రాయ పడుతున్నాను. కానీ ఈ యాత్రను చేపట్టే భక్తులను పరిశీలించినపుడు అధిక సంఖ్యాకులు అయోమయంగా చరించడము చూసినపుడు మనస్సు కలత చెందు తున్నది.

విజ్ఞాన భూమికలను అందించుటకు అనువైన ఈ యాత్ర విహారయాత్రగా మారడం శోచనీయం. నల్లని దుస్తులను ధరించి, ఎఱ్ఱని సిగరెట్టు పీకను నోటియందు ఉంచుకొని, కొరివిదయ్యాలలాగా, చీకటిలో భజనకెళ్తున్న ఉల్టా సీదా భక్తులను కొందరిని చూసినపుడు నిజమైన భక్తులకు హృదయము కలత చెందకపోదు.

మిధ్యాచార వ్యవహారాలు కొనసాగడంవల్ల వ్యక్తికి ఏయే వినాశనమే గాక సమిష్టికి కూడా నష్టమే వాటిల్లును. ఆధ్యాత్మిక వ్యవహారాలు ఎప్పుడూ లౌకికపరం కాకూడదు మూఢ విశ్వాసాలకు లోనైన సాంప్రదాయాలు శాశ్వతంగా నిలువవు.


భక్తులు ఈ సత్యమును మనసునందుంచుకొని పవిత్రమైన అయ్యప్ప యాత్ర ద్వారా పునీతులై తరించెదరని ఆశిస్తున్నాను.


**"స్వామియే శరణం అయ్యప్ప".**

శ్రీ స్వామి సుందర చైతన్యానంద (పూర్వ ప్రచురితము)

– శ్రీవాణి

# కోటప్ప కొండ





ఇటీవల కాలంలో ఈ ఆలయ పరిసరాలని ఎంతో అభివృద్ధి చేసారు. మెట్ల మార్గమే కాకుండా ఘాట్ రోడ్ కూడా వేసారు. శివార్చనకి పుష్పాలకోసం ప్రత్యేకంగా పూల వనాన్ని పెంచుతున్నారు. ఈ ఆలయం క్రీస్తు శకం 1172 నాటికే ప్రసిద్ధి చెందినట్లు వెలనాటి చోళ రాజైన కుళొత్తుంగ చోళరాజు, సామంతుడు మురంగినాయుడు వేయించిన శాసనాల ద్వారా తెలుస్తోంది. నరసరావుపేట, చిలకలూరిపేట, అమరావతి, పెట్లూరి వారిపాలెం జమిందార్లు, శ్రీకృష్ణ దేవరాయలు స్వామివారికి అనేక భూములని సమర్పించారు.

బ్రహ్మోపదేశం చేసిన క్షేత్రంగా దక్షయజ్ఞం విధ్వంసం తర్వాత శివుడు బ్రహ్మచారిగా చిరుప్రాయపు వటువుగా, మేధాదక్షిణామూర్తి రూపంలో కోటప్ప కొండలో వెలసినట్లు స్థల పురాణం. క్రీస్తు శకం 6, 7శతాబ్దాల్లోనే ఈ ప్రాంతాన్ని ఆనందగోత్రికులు, విష్ణుకుండినులు పాలించి త్రికూటాధిపతులుగా బిరుదులు పొందారు. దక్షిణాభిముఖంగా ఆశీనుడైన ఈ స్వామి అనుగ్రహంతో సర్వవిద్యలు లభిస్తాయని ప్రతీతి. విష్ణుశిఖరం మేధాదక్షిణా మూర్తి వద్ద విష్ణువు కూడా బ్రహ్మోపదేశం పొందినట్లు స్థల పురాణం చెబుతోంది.

కోటప్పకొండ క్షేత్రంలో శివుడు బాలుడిగా అవతరించాడు. ఎటు నుండి చూసినా మూడు శిఖరాలు ఉండటంతో ఇక్కడి శివుడు త్రికూటేశ్వరుడయ్యాడు. ఈ క్షేత్రంలో శివుడు దక్షిణామూర్తిగా బ్రహ్మ విష్ణువులకు బ్రహ్మోపదేశం చేశాడు. ఈ మూడు శిఖరాలను రుద్ర శిఖరం, బ్రహ్మ శిఖరం, విష్ణు శిఖరంగా భావిస్తూ కోటి మంది దేవతలు ఇక్కడ శివుడి కోసం తపస్సు చేయడం వల్ల కూడా ఈ క్షేత్రం కోటప్ప క్షేత్రంగా మారిందని భక్తుల నమ్మకం.

రుద్ర శిఖరం లోని లింగము ఒక అడుగు ఎత్తు కలది. ఈ రుద్ర శిఖరము పక్కనున్నది విష్ణు శిఖరము. రుద్ర శిఖరమునకు నైఋతి భాగమున ఉన్న శిఖరమునకు బ్రహ్మశిఖరమనిపేరు. ఇక్కడి రుద్ర,విష్ణుశిఖరములపై స్వయంభువులగు జ్యోతిర్లింగములు వెలసాయని అంటారు. బ్రహ్మ శిఖరం పై ఏమియు లేకపోవుటతో చింతిల్లి, బ్రహ్మ శివునిగూర్చి తపము చేసి శివుడిని లింగమును ఈ శిఖరము పై ఆవిర్భవింప చేసాడని అంటారు. ఈ బ్రహ్మ శిఖరంపై నున్న శివునికే శివరాత్రినాడు అతివైభవముతో తిరునాళ్ళు జరుగుతాయి.


శివరాత్రికి ఇక్కడ జరిగే ప్రభల సంబరం అత్యంత పేరు కలిగినది, విశేషమైనది. చుట్టుప్రక్కల గ్రామాలనుండి అశేష ప్రజానీకం శివరాత్రి సంబరాలకు ప్రభలు కోటప్పకొండకు తీసుకొస్తారు. పొడవైన వెదురు కర్రలకి వస్త్రాన్ని, కాగితాన్ని చుట్టి వెలిగించే ప్రభలు శివరాత్రి తిరునాళ్లలో కన్నులపండువగా, చూడముచ్చటగా ఉంటాయి.

గుంటూరు జిల్లా నరసరావుపేట దగ్గరలోని కోటప్పకొండ ఎత్తు 1587 అడుగులు కాగా, ఆలయం 600 అడుగుల ఎత్తులో ఉంది. ఈ ఆలయ పరిసర ప్రాంతంలో మనకి కాకులు కనిపించపోవటం ఒక ప్రత్యేకత.

ఈ ప్రదేశాన్ని కొండకావూరు అనేవారని తరువాతి కాలంలో కోటప్పకొండగా ప్రసిద్ధిగాంచిందని తెలుస్తోంది. ఈ ఆలయసమీపంలో ఎనిమిది తటాకాలు వున్నాయి. గుంటూరు జిల్లాలోని నరసారావుపేటకి నైరుతి దిక్కున 13 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం వుంది. చిలకలూరిపేట (10 కిలోమీటర్లు) నుంచి, నరసారావుపేట నుంచి కోటప్పకొండకి బస్సు సదుపాయం కలదు. అక్టోబర్ నుంచి మార్చ్ నెల వరకు భక్తులకి కోటప్పకొండ ఆలయ సందర్శనకు వాతావరణం చాలా అనుకూలంగా, ఆహ్లాదంగా ఉంటుంది.

**– డాక్టర్. బీ. యన్ . వీ. పార్థసారథి**





# అమరజీవి స్మారక భవనం అభివృద్ధికి కృషి చేస్తాం. ప్రముఖుల హామీలు

అమరజీవి స్మారక భవన నిర్వాహక నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మాగుంట శ్రీనివాసులురెడ్డి సభ్యుల చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ముఖ్యమంత్రి జగన్ అన్ని విధాలా ఆలోచించి, మంచి వ్యక్తులను గుర్తించి, కమిటీని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తాను చెన్నైలో వుండి కూడా ఇంతకాలానికి ఇక్కడకు రావడం సిగ్గు చేటైన విషయమని వ్యాఖ్యానించారు. ఇలాంటి దుస్థితిలో అమరజీవి స్మారక మందిరాన్ని చూడడం బాధాకరమన్నారు. అందుకే భవనం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అమరజీవి ప్రాణత్యాగం వల్లనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి స్మారకమందిరాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందన్నారు. ఢిల్లీ తరహాలోనే చెన్నైలోనూ ఏపీ భవనం ఉంటే బావుండేదన్న అభిప్రాయం వుందని, రాష్ట్ర గవర్నర్ రోశయ్య వున్నప్పుడు జగన్ దృష్టికి తీసుకెళ్లి, భవనం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. చేస్తానన్నారు. అమరజీవి భవనం అభివృద్ధి, లైబ్రరీ అభివృద్ధి తదితరాల కోసం అవసరమైన నిధుల కోసం కూడా సీఎంతో మాట్లాడతానని మాగుంట తన వంతు సహాయంగా 5 లక్షల రూపాయలు ప్రకటించారు.

ఎన్ని కష్టనష్టాలు భరించి అయినా అమరజీవి స్మారక భవనాన్ని బాగుచేస్తామని, సంస్థ నిలబడడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ నూతన అధ్యక్షుడు కాకుమాను అనిల్‌కుమార్ రెడ్డి ప్రమాణం చేశారు.

## సభ్యుల ప్రమాణం


భవన నిర్వహణా కమిటీ అధ్యక్షుడిగా కె. అనిల్ కుమార్ రెడ్డి, ప్రధానకార్యదర్శి, కోశాధికారిగా వి. కృష్ణారావు, సంయుక్త కార్య దర్శిగా వీఏ శశికళ, సభ్యులుగా డాక్టర్ విస్తాలి శంకరరావు, భువనచంద్ర, ఎంవీ నారాయణ గుప్తా, ఎంఎస్ లక్ష్మణ రెడ్డి, డాక్టర్ డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఏవీ శివకుమారి, జేఎం నాయుడు చేత మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సభ్యులు మాగుంటను దుశ్శాలువలతో సత్కరించారు. ●

# తెలుగు వెలుగు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు


తెలుగువెలుగు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెరంబూర్లోని డీఆర్‌బీసీసీ మహోన్నత పాఠశాలలో డిసెంబర్ 12 ఆదివారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆద్యంతం అలరించాయి. సంఘ అధ్యక్షులు అలింగం రాజశేఖర్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో తొలుత బాలల రచయిత డా. బెల్లంకొండ నాగేశ్వరరావు రచించిన 'వందేమాతరం' పుస్తకాన్ని భువనచంద్ర ఆవిష్కరించారు. రచయిత నాగేశ్వరరావుకు భువనచంద్ర, రచయిత పసుమర్తి బ్రదీనాథ్‌లు వెండి కంకణం బహూకరించారు. అనంతరం ప్రముఖ బాలసాహిత్య వేత్తలను 'తెలుగింటి ఆణిముత్యాలు–తెలుగు వెలుగు' పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. గ్రహీత







డీకే చదువులు బాబు (ప్రొద్దుటూరు), ఉండ్రాల రాజేశం (సిద్దిపేట), ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి (హైదరాబాద్) లున్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన ఆటలు, పాటలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. అలాగే, తిరుపతి బృందం 'భక్త ప్రహ్లాద' నాటికను ప్రదర్శించి సభను మరింత రంజింపజేసింది. వరదరాజ ప్రార్థనాగీతంతో ప్రారంభమైన సభకు హరిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ●



# పొట్టి శ్రీరాములు వర్ధంతి

పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న మద్రాసు, జార్జిటౌను, అణ్ణపిళ్ళ వీదిలోని 165వ నంబరు ఇంటిలో గురవయ్య, మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మిం చాడు. వారి పూర్వీకులది ప్రస్తుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లోని పడమటిపాలెం గ్రామం, ఇరవై యేళ్ళ వరకు శ్రీరాములు విద్యాభ్యాసం మద్రాసు లోనే జరిగింది. తరువాత బొంబాయిలో శానిటరీ ఇంజనీరింగు చదివాడు. తరువాత "గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే"లో చేరి దాదాపు నాలుగేళ్ళు అక్కడ ఉద్యోగం చేసారు.

1928లో వారికి కలిగిన బిడ్డ చనిపోవడం జరిగింది. తరువాత కొద్ది రోజులకే అతని భార్య కూడా చనిపోయింది. 25 యేండ్ల వయసు కలిగిన శ్రీరాములు జీవిత సుఖాలపై విరక్తి చెంది ఉద్యోగానికి రాజీనామా చేసారు. ఆస్తిపాస్తులను తల్లికి, అన్నదమ్ములకు పంచిపెట్టి, గాంధీజీ అనుయాయిగా సబర్మతి ఆశ్రమం చేరాడు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు.

## స్వాతంత్రోద్యమంలో పాత్ర

పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడు. తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సరాల్లో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలు శిక్ష అనుభవించాడు. 1985లో ప్రచురింప బడిన ఆంధ్ర ఉద్యమం కమిటీ (Committee for History of Andhra Movement) అధ్యయనంలో పొట్టి శ్రీరాములు- మహాత్మా గాంధీల మధ్య అనుబంధం గురించి ఇలా వ్రాయబడింది. "సబర్మతి ఆశ్రమంలో శ్రీరాములు సేవ చరిత్రాత్మకమైనది. ప్రేమ, వినయం, సేవ, నిస్వార్ధత లు మూర్తీభవించిన స్వరూపమే శ్రీరాములు. గుజరాత్ రాష్ట్రంలోని రాజీకోట్లోను, ఆంధ్రలో కృష్ణా జిల్లాలోని కొమరవోలులోను గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు.. కొమరవోలులో యెర్నేని సుబ్రహ్మణ్యం నెలకొల్పిన గాంధీ ఆశ్రమంలో చేరాడు. 1943-44లో నెల్లూరు జిల్లాలో చరఖా వ్యాప్తికి కృషిచేసాడు. కులమతాల పట్టింపులు లేకుండా ఎవరి ఇంట్లోనైనా భోజనం చేసేవాడు. 1946లో నెల్లూరు మూలపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో హరిజనుల ప్రవేశంకోసం నిరాహారదీక్ష బూని, సాధించాడు. మరోసారి నిరాహారదీక్ష చేసి, మద్రాసు ప్రభుత్వం చేత హరిజనోద్ధరణ శాసనాలను ఆమోదింపజేసాడు. దీని ఫలితంగా వారంలో కనీసం ఒకరోజు హరిజనోద్ధరణకు కృషి చెయ్యవలసిందిగా ప్రభుత్వం కలెక్టర్లకు ఉత్తరువులు ఇచ్చింది. ఆంధ్ర రాష్ట్రసాధన దీక్ష మద్రాసు రాజధానిగా వుండే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు మద్రాసులో 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించాడు. చాలా మామూలుగా ప్రారంభమైన దీక్ష. క్రమంగా ప్రజల్లో అలజడి రేపింది. ఆంధ్ర కాంగ్రెసు కమిటీ మాత్రం దీక్షను సమర్ధించలేదు. ప్రజలు మాత్రం శ్రీరాములుకు మద్దతుగా సమ్మెలు, ప్రదర్శనలు జరిపారు. ప్రభుత్వం మాత్రం రాష్ట్రం ఏర్పాటు దిశగా విస్పష్ట ప్రకటన చెయ్యలేదు. చివరికి 1952 డిసెంబర్ 15 అర్ధరాత్రి పొట్టి శ్రీరాములు, తన ఆశయసాధనలో ప్రాణాలర్పించి అమరజీవి అయ్యాడు. ఆగ్రహావేశు లైన ప్రజలు హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. మద్రాసులో జరిగిన ఆయన శవయాత్రలో నినాదాలతో ప్రజలు ఆయన త్యాగనిరతిని కొనియాడారు. తదుపరి జరిగిన పరిణామాలలో మద్రాసు నుండి విశాఖపట్నం వరకు ఆందోళనలు, హింస చెలరేగాయి. పోలీసు కాల్పుల్లో ప్రజలు మరణించారు. చివరికి డిసెంబర్ 19న ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుచేస్తూ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ప్రకటన చేసాడు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే ఒక్క రోజు కూడా ఆంధ్రులు మద్రాసులో రాజధాని పెట్టుకోటానికి వీల్లేదని మరునాడే వెళ్ళిపోవాలని చక్రవర్తుల రాజగోపాలాచారి తెగేసి చెప్పాడు. అయితే కాకతీయులు పాలించిన వరంగల్లు రాజధానిగా బాగుంటుందని అంబేద్కర్ సూచించారు. రాజమండ్రి కూడా మంచిదేనన్నారు. విజయవాడ కమ్యూనిస్టుల కంచు కోట కాబట్టి కాంగ్రెస్ వాళ్ళు వొప్పుకోలేదు. నెల్లూరు, చిత్తూరు నాయకులు మాకు మద్రాసు దగ్గరగా వున్న సౌకర్యం వదులుకోవాలా అని అలిగారు. కోస్తా వాళ్ళను మేము నమ్మం, రాజధాని రాయలసీమలోనే పెట్టాలని, లేకపోతే ఆంధ్ర రాష్ట్రమే వద్దని నీలం సంజీవరెడ్డి తదితరులు ఎదురుతిరిగారు. గత్యంతరంలేక కర్నూలు రాజధానిగా 1953 నవంబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పరచారు. బళ్ళారి, బరంపురం, హోస్పేట, తిరువళ్ళూరు లాంటి తెలుగు ప్రాంతాలు కూడా వదులుకొని ఆంధ్ర రాష్ట్రం ఏర్పరచారు.

మరణం

డిసెంబర్ 15 శ్రీరాములు ఆత్మార్పణ రోజు!! ఉదయం నుంచే ఆయన స్పృహలో లేరు. కళ్లు తెరిచారు. అంతలోనే మూతలు పడపోయేవి. చేతులు కదిపేందుకు కూడా శక్తి లేదు. 54 పౌనుల (24.5 కేజీలు) బరువు తగ్గారు. నాడి కదలిక, శ్వాసతీరుల్లో మార్పు వచ్చింది. 16 గంటలపాటు మూత్రం స్తంభించింది. నోటిమాట కష్టమైంది. అప్పుడప్పుడు అపస్మారకంలోకి వెళ్లేవారు. సందర్శకులను నిలిపివేశారు. సాయంత్రం వచ్చిన ప్రకృతి చికిత్సకులు వేగిరాజు కృష్ణమరాజు, ఆయన సతీమణులతో మాట్లాడలేకపోయినా... చిరునవ్వుతో స్వాగతం పలికారు. అప్పటి నుంచి క్రమంగా శరీరం చల్లబడిపోయింది. రాత్రి 11.23 గంటలకు పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకొన్నారు.

**- ఎల్లూరి పవన్ కుమార్ (విప్ర ఫౌండేషన్)**



# స్వామి సమర్థ రామదాసు ఛత్రపతి శివాజీకి ప్రసాదించిన కాషాయ పతాకం



శక్తి మాత యైన భారతమాత అనుగ్రహంతో ఈ భువినెందరెందరు మహానుభావులు, త్యాగధనులు, రాగ విరాగులు జన్మించి, ఈ పుడమిని పునీతం చేశారో! దివ్య జనని అనుగ్రహంతో సమర్ద రామదాసు సనాతన ధర్మ పునరుద్ధరణ కోసం ఛత్రపతి శివాజీకి బాసటగా నిలిచారు, వారి ఆదేశం మేరకు శివాజీ రాజుగా గాకుండా రాజప్రతినిధిగా రాజ్యపాలనం చేశాడు.

సహ్యాద్రి పర్వతములపై శత్రు దుర్భేద్యమైన కోటను నిర్మిస్తూ, గురువులు సమర్ద రామదాసు, శివాజీ మహరాజు శిఖరాగ్రం నుంచి కోట నిర్మాణ పనులు చూస్తున్నారు. దివాకరుడు పూర్వాద్రీ పశ్చిమాద్రిల నడుమ ప్రచండంగా తీక్షణ వీక్షణములను ప్రసరింపచేస్తున్నాడు. వాటిని ఛేధిస్తున్నట్లుగా పనివారలు పగుల కొడ్తున్న సహ్యాద్రి శిలలు, ధూళి నల్లని మేఘములుగా సుడులు తిరుగుతూ ఆ ప్రాంతాన్ని క్రమ్ముకొస్తూంది. కొండ దిగువ చింతచెట్ల రెమ్మలకు గట్టిన గుడ్డ ఊయలలోని పిల్లలకు పాలు యిచ్చి, తిరిగి వెంటనే కొండపైకి వెళ్లి పనుల్లో నిమగ్నం కావడం గురువులు రామదాసు నెంతో స్పందింపచేసింది. –భేష్ రాజా భేష్ నిర్మాణం పని చిత్తశుద్ధితో జరుగుతూంది. సంతోషం' అన్నారు. కాషాయ కౌపీనం, నుదుట తిరుచూర్ణ నామం, కుడి భుజమున తగిలించుకున్న కాషాయ సంచీ చూచి నల్లటి ధూళి మేఘములు సొక్కి సుక్కుచున్నవి.

'అవును గురుమహరాజా! బాధ్యతతో అందరూ పనిచేస్తున్నారు. ఇంత మందికి పని యిచ్చి, జీవనాధారం కల్పించకల్గినందులకెంతగానో సంతోషిస్తున్నాను. ఇంత మందికి మనం ఉపాది కల్పించ కల్గినందుకే, వారు సుఖంగా జీవించకల్గుతున్నారు. లేనిచో వారు పిల్లా పాపలతో పస్తుండవలసి వచ్చేది.' అనగానే గురువులు రామదాసు శివాజీ వంక నిశితంగా చూశారు.

అంతటి గొప్ప సత్యశీలియైన మహరాజు మాటల్లో ఆవగింజంత 'అహం' దొరలడం గురువులు గ్రహించారు. ఇంతలో పైశిఖరాగ్రం నుంచి ఓ చిన్న రాయి ముందు పడింది. బొరియలోంచి ఓ కప్పపిల్ల అందులోని చెలమనుంచి బయటకు వచ్చింది. రామదాసు గురువులు శివాజీ వంక చూస్తూ 'ఎంత గొప్పవాడవు రాజా– రాతిలోని కప్పపిల్ల ఉపాది, భద్రతలను సహితమూ నీవే చూస్తున్నావ్'– అనేసరికి గురువుగారి మాటల్లోని అంతరార్థం శివాజీ గ్రహించాడు. మహాత్ముల ముందలా మాట్లాడి ఉండకూడదనెడి తప్పును గ్రహించాడు. 'మన్నించండి గురుమహారాజా! నా శిరముపై గల కిరీటమునూ, రాజ్యమునూ, వైభవమునూ, సిరిసంపదలనూ, మీకే సమర్పిస్తున్నాను, స్వీకరించండి' అంటూ శిరము వంచి కరములు మోడ్చి అర్థించాడు.

'మేము సర్వసంగ పరిత్యాగులం. సన్యాసులం రాజ్యము, సిరీ సంపద మాకు ఎందుకు – మేమేమి చేసుకోగలం! గురువులనేసరికి – 'ఇచ్చినవి తిరిగి తీసుకునే ప్రసక్తి లేదు గురు మహారాజా – మీరే స్వీకరించాలి' అని శివాజీ ప్రాధేయపడగా – అవశ్యం కానిమ్ము, ఈ రాజ్యము మాదే! నీవు మా ప్రతినిధిగా, ధర్మనిష్ఠతో ప్రజాపాలన చేయుము. ప్రజల క్షేమమే ధ్యేయంగా పాలింపుము. సనాతన ధర్మమే దేశానికి, శ్రేయస్కరం. ఇదిగో నేను భిక్షాటన చేసే జోలికి కట్టిన, పవిత్ర కాషాయ వస్త్రాన్ని నీకు ప్రసాదిస్తున్నాను. దీనినే నీవు రాజపతాకంగా, స్వీకరించు. ధర్మబద్ధంగా పాలనం చేయి' అంటూ ఛత్రపతీ! నీవు రాజప్రతినిధిగానే రాజ్యమేలుము! రాజువనెడి అహమును వీడి, ఈ దేశము దైవదత్తమని భావించుము. నేను నిరతమూ భిక్షను గ్రహించు 'భగవజ్యోతి'కి చుట్టబడిన ఈ పవిత్రమైన నారింజ రంగు గుడ్డను నీ కోట బురుజుపై నెగురవేయుము. నీలి ఆకాశము నందు దేదీప్యమానంగా వెలుగొందు ఈ నారింజ పతకం నీ మనోకాశము నందు జ్ఞానకాంతుల్ని ప్రసరింపచేస్తుంటుంది, పాలకుడు ప్రజా ప్రతినిధియే తప్ప ప్రభువు కానేరడను విషయాన్ని జ్ఞప్తికి తెస్తూంటుంది. అహాన్ని త్యజింపచేస్తుంది, అహంకారాన్ని నశింపచేస్తుంది. అంతఃకరణము నందు చొరబడిన సూర్యకిరణము వలె పవిత్రభావము కలుగచేస్తూంది. ఈ రంగు (కాషాయము) నందంతటి మహత్తర శక్తి ఉంది' అంటూ సమర్ధ రామదాసు శివాజీకి తన జోలెపై కల కాషాయ వస్త్రాన్ని బహూకరించారు. శివాజీ ఆ కాషాయ వస్త్రాన్ని రాజపతాకంగా నెగురవేశారు. పవిత్ర ఆత్మ కలిగి, పవిత్ర ఆశ్రయంతో కరడు కట్టిన ముష్కరులను, దేశద్రోహులను దేశం నుండి తరిమి, రాజువలె గాక, ప్రజాప్రతినిధిగ రాజ్యపాలనం చేశాడు. అతని ధర్మపాలనను జూచీ భవానీ రాజఖడ్గాన్ని ప్రసాదించింది. సమర్ధ రామదాసు అనుగ్రహంతో శౌర్యమూర్తియై, సత్యమూర్తియై శివాజీ రాజప్రతినిధిగా రాజ్యపాలన చేశాడు. తదాదిగా మహాయోగులందరూ కాషాయ వస్త్రములనే ధరించారు. మహాయోగి మహాత్మాగాంధీ గారు సహితమూ పింగళి వెంకయ్యగారి సలహాతో – జాతీయ (త్రివర్ణ) పతాకంలోని పైభాగమునకూ త్యాగానికి ప్రతీకగా ఆ రంగునే నిర్ణయించారు. ●

# ధనుర్మాసం

## 16 నుండి ధనుర్మాసం ప్రారంభం
## గోదాదేవి ఎవరు? 'పాశురాలు' అంటే ఏమిటి?
## వాటి పరమార్థం ఏమిటి?




గోదాదేవి 1200 ఏళ్ల క్రితం అవతరించిన వైష్ణవ వైతాళికులు పన్నిద్దరాళ్వారులలో ఏకైక మహిళ. ఆళ్వారులు పాడిన నాలాయిర ప్రబంధంలో (4000 పాశురాలు) గోదాదేవి పాడిన 30 పాశురాలకు అతి విశిష్ట స్థానం ఉంది. గోదాదేవి తనని తాను రేపల్లెలో గొల్లభామగా భావించుకుంది. తమ మధ్యనే తిరుగాడే శ్రీకృష్ణస్వామిని పగలంతా చూస్తున్న సంతోషం, రాత్రివేళ చూడలేని తాపం, తెల్లవారే వేళనే కన్నులారా చూసి తరించాలన్న తపన, ఆత్రం కలబోసిన భావరాగానురాగాల పారిజాతాల మాల తిరుప్పావై. పాశురాల పరమార్థం:

తిరుప్పావైలో ఉన్న మొత్తం పాశురాలు 30. వీటిలో మొదటి అయిదు ఉపోద్ఘాతంగా ఉంటాయి. తిరుప్పావై ప్రాధాన్యతను వివరిస్తాయి. భగవంతునికి చేసే అర్చన మొదలు నివేదన వరకు అన్ని ఉపచారాల్లో ఆడంబరం అవసరం లేదని, చిత్తశుద్ధి ఉంటే భగవంతుడు సంతోషిస్తాడని ఈ పాశురాలు చెబుతాయి. భగవంతుని ఆరాధించటం వల్ల వానలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు నిండుగా పండుతాయని, దేశం సుభిక్షంగా ఉంటుందని వీటిలో ఉంది.

తర్వాతి పది పాశురాల్లో చెలులతో కలిసి శ్రీరంగనాథుని సేవించడానికి గోదాదేవి వెళ్తున్న సన్నివేశాలు వర్ణితమై ఉంటాయి. పదిహేను నుంచి ఇరవయ్యో పాశురం వరకు గోదాదేవి చెలులతో కలిసి దేవాలయానికి వెళ్లిన విషయాలు, అక్కడి శిల్పసౌందర్యాల వర్ణనలు, రంగనాథునికి సుప్రభాతం పాడటం మొదలైనవి ఉంటాయి. కృష్ణుడి అష్టభార్యల్లో ఒకరైన నీలాదేవి ప్రార్థన కూడా ఈ పాశురాల్లోనే ఉంటుంది.

చివరి తొమ్మిది పాశురాలు పూర్తిగా భగవంతుడి విలాసాన్ని ప్రకటిస్తాయి. నిష్కల్మష హృదయంతో తన హృదయాన్ని రంగనాథుడికి అర్పించుకుంటుంది గోదాదేవి. చివరి పాశురంలో ఫలశృతి చెబుతూ ఎవరైతే ఈ పాశురాలు ఎవరైతే గానం చేస్తారో వారికి భగవంతుడి అనుగ్రహం తప్పకుండా కలుగుతుందని చెబుతుంది.

– మామిళ్ళపల్లి జగన్ మోహన్ శర్మ




# భగవంతుని పాట భగవద్గీత!

ఈ ప్రపంచంలో వ్యక్తులు పుట్టినరోజులు జరుపుకోవడం సర్వసాధారణం. కానీ, ఒక 'పాట' పుట్టినరోజు జరుపుకోవడం ఎక్కడైనా విన్నారా? ఆ పాట దేవుడే స్వయంగా పాడితే?! ఆ పాట పుట్టినరోజు కొన్ని వందల తరాలుగా జరుపుకునే గొప్ప సంఘటనగా మారుతుంది.

దాదాపు 5 వేల సంవత్సరాలకు పూర్వం శ్రీకృష్ణ భగవానుడు తన స్నేహితుడు, భక్తుడైన అర్జునుడిని ప్రోత్సహించడానికి పాడిన పాటనే 'భగవద్గీత'.

'శ్రీమద్ భగవద్గీత' భారతదేశంలో అత్యంత ప్రసిద్ధమైన, విస్తృతంగా అధ్యయనం చేయబడిన ఆధ్యాత్మిక గ్రంథాలలో ఒకటి. 'భగవద్గీత' గంభీరమైన సిద్ధాంతానికి, రోజువారీ జీవితంలో ఆచరణాత్మక విలువలకు ఎంతో ప్రసిద్ధి చెందింది.

కురుక్షేత్ర యుద్ధభూమిలో సందిగ్ధంలో పడిన అర్జునుడికి సత్యాన్ని, తత్త్వాన్ని, వివేకాన్ని బోధించడానికి దేవాదిదేవుడు శ్రీకృష్ణుడు పాడిన గొప్ప ఆధ్యాత్మిక గీతం 'భగవద్గీత'.

శ్రీకృష్ణుడు దీనిని మానవాళికి అందించిన రోజునే 'గీతా జయంతి'గా భక్తులు స్మరిస్తారు.

జీవితసత్యాలను అర్థం చేసుకోవడానికి, మానవ జీవితాన్ని ఆదర్శవంతంగా గడపడానికి గీతాధ్యయనం అతిగొప్ప సాధనం.

'సంపూర్ణ విజ్ఞానం' అంటే, తాత్కాలికమైన ఈ భౌతిక ప్రపంచాన్ని, శాశ్వతమైన ఆత్మను, ఈ రెండిటికీ మూలమైన ఆ భగవంతుణ్ణి తెలుసుకోవడమే.

'భగవద్గీత' మనకు అయిదు పరమ సత్యాలను బోధిస్తున్నది. అవి: అన్నిటికీ కారణభూతుడైన భగవంతుడు, ఆయన అంశలైన జీవులు, ఆయననుండి వెలువడిన ప్రకృతి (భౌతిక ప్రపంచం), అన్నిటినీ నియంత్రించే కాలం, కర్మ అంటే జీవుల మంచి-చెడు కార్యకలాపాలు. ఈ సత్యాల క్రమబద్ధమైన విశ్లేషణతోనే భక్తులకు భౌతిక, ఆధ్యాత్మికతలలోని సత్యం బోధపడి 'జ్ఞానోదయం' అవుతుంది.


గీతలోని 18 అధ్యాయాలను, 3 విభాగాలుగా విభజిస్తే కర్మ, భక్తి, జ్ఞాన యోగాలను ప్రధానంగా చూస్తాం. భగవద్గీత తొలి ఆరు అధ్యాయాల ప్రధానాంశం కర్మయోగం. స్వార్థపు కోరికలు లేకుండా (నిష్కామంగా) తమ కర్తవ్యాలను, విద్యుక్త ధర్మాలను బాధ్యతతో నిర్వర్తించడం కర్మయోగం. ఆత్మ తాలూకు శాశ్వత స్వభావాన్ని, భవబంధాలలో చిక్కుకోకుండా పనిచేసే ప్రక్రియలను శ్రీకృష్ణుడు వీటిలో వివరించాడు. మధ్యలోని ఆరు అధ్యాయాలలో ముఖ్యోద్దేశమంతా ఒక సారాంశంలా ఏర్పడిందే భక్తియోగం. 'భక్తి' అంటే భగవంతునికి నిస్వార్థంగా, నిరంతరాయంగా, ప్రేమపూర్వకంగా సేవ చేయడమే. దీనితో మనం భగవంతుని శాశ్వతధామాన్ని చేరుకోగలుగుతాం.

ఇక, భగవద్గీతలోని చివరి ఆరు అధ్యాయాలు జ్ఞానయోగం. మొదటి ఆరు అధ్యాయాలనే మరింత వివరంగా ఇవి విశ్లేషిస్తాయి. ఇందులో శ్రీకృష్ణుడు శరీరం, ఆత్మ, పరమాత్మల మధ్య వ్యత్యాసాన్ని, త్రిగుణాలు (సత్త్వ రజ స్తమో), వాటితో ప్రభావితమైన జీవుల ప్రవర్తన ఇందులో చదువుతాం.

'భక్తియోగం భగవద్గీత మధ్యలో ఎందుకు ఉంది?' అన్నది ఆసక్తికరమైన సందేహం. ఒక మహారాజు రథంలోనో, పల్లకీలోనో ప్రయాణిస్తున్నప్పుడు ఆయన ముందు, వెనుక వేలాదిమంది సైనికులు, ప్రజలు, గుర్రాలు, ఏనుగులతోసహా సేవకులుకూడా ఉంటారు. రాజు వారందరిలో అతిముఖ్యమైన వ్యక్తి కనుక మధ్యలో ఉంటాడు. 'భక్తియోగం' ఎంతో ఉన్నతమైంది, నిగూఢమైంది. కాబట్టే, శ్రీ కృష్ణుడు గీత మధ్య అధ్యాయాలలో ప్రబోధించినట్టుగా అర్థం చేసుకోవాలి.

శ్రీకృష్ణుడు చివరలో 'తనను సంపూర్ణంగా ఆశ్రయించి ఆరాధించే ప్రతీ ఒక్కరినీ అన్ని పాపాలనుండి సంపూర్ణంగా విముక్తులను చేస్తాను' (18-66) అని ప్రకటించాడు. 'గీతలోని ఈ బోధలను వ్యాప్తి చేసేవారు తనకెంతో ప్రియమైన వారనికూడా' ఆయన పేర్కొన్నాడు.

**లోకా సమస్తా సుఖినోభవన్తు!**





నువ్వు పుట్టినపుడు ప్రపంచం నవ్వింది, అప్పుడు నువ్వు ఏడ్చావు.
నువ్వు మంచిగా, పవిత్రంగా, బతికి మృత్యువును అందుకున్నప్పుడు,
" అరే ఎంత మంచివాడికి చావొచ్చింది '
అని ప్రజలు నీకోసం ఏడుస్తారు,

- స్వామి వివేకానంద

# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

**ఇక్కడ ఈ ముగ్గురు అంతటి గొప్పవారే, వారి పట్ల జనులు స్పందించిన తీరు పై వివేకానంద సూక్తికి సరిగ్గా సరిపోతుంది.**




వీర సేనాని బిపిన్ రావత్ మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నాం, యావత్ భారతదేశం దిగ్భ్రాంతికి గురయ్యింది. భరతమాత హృదయం బరువెక్కింది. తన సర్వసైన్యాధిపతి త్రిదళాధిపతి మృతిపట్ల భారతీయులు భావోద్వేగానికి గురయ్యారు, తమ స్వంత కుటుంబసభ్యుడిని పోగొట్టుకున్నంతగా బాధపడ్డారు, వీరులకు వందనం, భారతమాతాకు జై అంటూ నినదించారు. బిపిన్ రావత్‌తో ఆయన శ్రీమతి మధులిక మరియు పదకొండు మంది సైనిక అధికారులు ఆ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు, అందులో ఒక్కరు వరుణ్ సింగ్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు, ఆయన ప్రాణాలను కాపాడటానికి వైద్య బృందం శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఆయన మరణించారని వార్త.

భారతదేశం అద్భుత వ్యూహకర్త, గొప్ప యుద్ధ నిపుణుడు, ప్రతిభావంతుడైన సైనిక నాయకుడు బిపిన్ రావత్ అనే అసాధారణ అనుభవజ్ఞుడైన నాయకుడిని పోగొట్టుకుంది. గత రెండేళ్ళలో భారత భద్రతా వ్యవస్థలో పలుమార్పులు తీసుకొచ్చి చైనా, పాక్ వంటి దేశాలకు ధీటైన జవాబిస్తూ, ఒక అంకిత దేశ భక్తునిగా వీర సైనికుడిగా బిపిన్ రావత్ ఎప్పుడు భారతీయులకు గుర్తుండి పోతారు.

అమరవీరుల మృతదేహాలను తమిళనాడు నుండి కేంద్రానికి తరలించే ప్రక్రియలో పువ్వులతో అలంకరించిన ఆ ప్రత్యేక వాహనాలలోని సైనిక వీరులకు దారి పొడవునా ప్రజలు పువ్వులను జల్లి భారతమాతకు జై అంటూ ఆ భరతమాత ముద్దు బిడ్డలకు తమ వందనాన్ని గౌరవాన్ని అందించారు.

## అజాతశత్రువు రోశయ్య ఇక లేరు



నిగర్వి, రాజకీయ దురంధురుడు, మచ్చలేని నాయకుడు, అచ్చ తెలుగువాడు, అందరివాడు రోశయ్యగారు లేరనడం బాధించింది. విలువలతో కూడిన రాజకీయానికి నిలువెత్తు నిదర్శనం, చూస్తేనే చెయ్యెత్తి దణ్ణం పెట్టాలనే తలంపు కలిగే నిండైన విగ్రహం, తెల్లని వస్త్రాలు, అచ్చ తెలుగు పంచెకట్టు, అందరిని ఆకర్షించే పలకరింపు, ఆజానుబాహువైన విగ్రహం రోశయ్యగారిది. అందరికి సమానంగా గౌరవం ఇచ్చిపుచ్చుకునేవారు. ఆయన తమిళనాడు గవర్నర్‌గా వున్న సమయంలో తమిళనాడులోని తెలుగువారికి పెద్ద దిక్కుగా, కొండంత అండగా వుండేవారు. అంతటి పెద్ద వయసులోను తెలుగువారు జరుపుకునే కార్యక్రమాలలో ముఖ్య అతిధిగా వెళ్ళేవారు. అంతేనా పనుల ఒత్తిడిలో కూడా వీలు కల్పించుకుని వెళ్ళేవారు. తాను ఆ సభలో పాల్గొంటూ ఆ సభకు హుందాతనాన్ని తీసుకు వచ్చే వారు. తన స్వచ్ఛమైన తెలుగు ఉచ్చారణతో అద్భుతమైన ప్రసంగాన్ని అందించేవారు, ఆయనకున్న అనుభవరీత్యా ఏది ఎలా మాట్లాడాలో బాగా తెలిసిన గొప్ప వక్త, ఆ ఉపన్యాసాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకునేవి. ఆయన తమిళనాడు గవర్నర్‌గా ఉన్న సమయంలో ఒక పదిసార్లన్నా ఆయన్ను కలిసే అవకాశం కలిగింది. మా తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్‌కు మూడు మార్లు ముఖ్య అతిధిగా విచ్చేశారు, అలాగే తెలుగు బ్రాహ్మణ మహాసభ ఉగాది వేడుకలకు, శుకబ్రహ్మాశ్రమం స్వామి శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వామి శతజయుంతత్సవాలకు ఆయన్ను ఆహ్వానించడం ఆయన రావడం జరిగాయి. ఒకసారి నేను నాన్నగారు ఆయన్ను కలిసి ఒక గంటసేపు ఆయనతో గడిపినా ఆ సమయాన్ని ఎప్పటికి మరిచిపోలేను. ఆయనకు నాన్నగారిమీదున్న గౌరవరీత్యా మా అమ్మాయి వివాహానికి వచ్చి దంపతులను ఆశీర్వదించడం ఇంకా కళ్ళలో మెదుల్తూనే వుంది. తన మంచితనంతో తమిళనాడులోని తెలుగువారికి ఆప్తమిత్రుడయ్యారు, వారి ఉత్సవాల్లో పాల్గొంటూ వారిని బాగా ఉత్సాహపరిచేవారు. వయసు రీత్యాను, అనారోగ్య కారణంగా మృతిచెందిన రోశయ్యగారి మరణవార్త తీవ్రవేదనను కలిగిస్తోంది, రోశయ్యగారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను.

## వెన్నెల్లో కలిసిపోయిన సిరివెన్నెల



సిరివెన్నెల సినిమాతో గీత రచయితగా పరిచయం అయ్యి, ఆ సినిమా పేరునే ఇంటిపేరుగా చేసుకుని, మొదటి చిత్రం పాటకే నంది అవార్డునందుకుని, 66 ఏళ్ళ వయసుకే గగనానికి వెళ్ళిపోయారు సీతారామశాస్త్రిగారు. తెలుగు సినిమా పాట స్థాయిని పెంచిన రచయిత, భారత ప్రభుత్వానుండి పద్మశ్రీ పురస్కారాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానుండి మొత్తం 11 నందులు, నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారాయన. దాదాపుగా 800 సినిమాలలో 2400 పాటలను రాశారు. పుట్టుక నుంచి మరణం వరకు ఆయన రాయని సందర్భం లేదు. ఆది భిక్షువు వాడినేమి కోరేది, బూడిదిచ్చినవాడినేమి కోరేది అంటూ ఆ ఈశ్వరుణ్ణి అడిగిన తీరు అద్భుతం. ఆణిముత్యాలయిన సినిమా పాటలకు సొగసులద్దిన ఆ కలం మూగబోయింది. విధాత తలపున ప్రభవించిన సాహిత్యశిఖరం లేదని వాపోయింది. నేను 2015 లో మా ప్రెస్ నీట మునిగి ఏమి చెయ్యాలో తోచనప్పుడు "ఎప్పుడు ఒప్పుకోవద్దురా ఓటమి" అన్న ఆయన పాటే నాలోని పట్టుదలను పెంచింది. మన మనసులో ఎప్పటికి నిలిచిపోయే ఆయన పాటలు తెలుగు భాష ఉన్నంత కాలం చిరస్మరణీయంగా వుంటాయి. ●

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే

# అతి



## 324 నెలలుగా
## 324 సంచికలను

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదదందంటే ఏడుకొండల తేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.25000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**Posted at Egmore / RMS Pathrika Channal, posted between 5 - 8, December 2021**









# The One Stop solution for all your Printing Needs

## GOTETI GRAPHICS

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA

✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

***Our print support creates a remarkable value in your business***